



● పిడుగురాళ్లలో కవాతు నిర్వహిస్తున్న ఎస్పీ మాలికా గార్గ్, పోలీసు అధికారులు

పోలీసు శాఖ.. కొరడా

- పోలింగ్ హింసపై ప్రత్యేక దృష్టి
- బైండోవర్ ఉల్లంఘించిన వారిపై చర్యలు
- అల్లర్లకు పాల్పడిన 382 మందిపై రౌడీషీట్లు
- శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారు జిల్లా బహిష్కరణ

నరసరావుపేట, మే 31 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ రోజు, ఆ తర్వాత పల్నాడులో చోటు చేసుకున్న హింసాకాండపై పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. హింసకు పాల్పడిన వారిపై పోలీసు శాఖ కొరడా ఝుళిపిస్తోంది. ఎన్నికల ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసులు జిల్లాలో పది వేల మందికిపైగా బైండోవర్ చేశారు. బైండోవర్‌లో ఉన్న వ్యక్తులు ఎన్నికల సందర్భంగా జరిగిన పలు హింసాత్మక సంఘటనల్లో పాల్గొన్నట్లు పోలీసు అధికారులు గుర్తించారు. హింసాత్మక ఘటనల్లో పాల్గొన్న 382 మందిపై రౌడీషీట్లు తెరిచారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని జిల్లా బహిష్కరణకు పోలీసుశాఖ సమాయత్తమవుతోంది. ఎన్నికల సందర్భంగా ఎటువంటి నేరాలకు పాల్పడమని, నేరాలకు పాల్పడితే తమపై చర్యలు తీసుకోవచ్చని బైండోవర్ సందర్భంగా ఒప్పంద పత్రాలను రెవెన్యూ శాఖ ద్వారా పోలీసు శాఖ స్వీకరించింది. తాము నేరాలకు పాల్పడితే నగదు కూడా చెల్లిస్తామని కూడా అంగీకరించారు. అయితే జిల్లాలో 13, 14 తేదీల్లో జరిగిన హింసాకాండ ఘటనల్లో పాల్గొన్న వ్యక్తులను గుర్తించి వారిపై పోలీసు శాఖ కేసులు నమోదు చేసింది. ఈ ప్రక్రియలో భాగంగా బైండోవర్‌లోని వ్యక్తులు నేరాల్లో పాల్గొన్నరా అన్న అంశంపై పోలీసు శాఖ ప్రత్యేకంగా దృష్టి సారించింది. బైండోవర్‌లో ఉన్న దాదాపు 250 మంది పోలింగ్ హింస ఘటనల్లో ఉన్నట్టుగా నిర్ధారించి పోలీసులు నోటీసులు చేశారు. బైండోవర్‌ను ఉల్లంఘించిన వారిని మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. బైండోవర్ సందర్భంగా తీసుకున్న బాండ్ మేరకు వారి వద్ద సదరు మొత్తం వసూలు చేయనున్నారు. ఒక్క గురజాల పోలీసు డివిజన్‌లోనే 147 మంది బైండోవర్ ఉల్లంఘించి నట్లు పోలీసుశాఖ తెలియజేసింది. నరసరావుపేట, సత్తెనపల్లి పోలీసు డివిజన్ల పరిధిలో దాదాపు 103 మందిని గుర్తించారు. బైండోవర్ సందర్భంగా గతంలో వారు చేసిన నేరాలను, సదరు ప్రాంతాలను పరిగణనలోకి తీసుకుని ఒక్కొక్కరి నుంచి రూ.50 వేలు నుంచి రూ.2 లక్షల వరకు బాండ్లు స్వీకరించారు. బాండ్ లో నమోదు చేసిన మేరకు డబ్బు చెల్లించాలని సదరు వ్యక్తులకు నోటీసులు కూడా జారీ చేశారు. ఒక వేళ బాండ్‌లో పేర్కొన్న విధంగా డబ్బు చెల్లించలేకపోతే వారి ఆస్తులను జప్తు చేసేందుకు అధికారులు సమాయత్తం అవుతున్నారు. ఒకవేళ ఆస్తులు లేకుంటే వారెంట్ తీసు కుని జైలుకు పంపే అంశాన్ని పోలీసు శాఖ పరి శీలిస్తోంది.

161 కేసులు 1320 అరెస్టు

పల్నాడు జిల్లాలో పోలింగ్ హింసాత్మక సంఘటనల నేపథ్యంలో పోలీసులు 161 కేసులు నమోదు చేశారు. ఆయా కేసులకు సంబంధించి ఇప్పటి వరకు 1320 మందిని అరెస్టు చేశారు. కేసుల్లో ఉన్న వ్యక్తులను అరెస్టు చేసేందుకు ప్రత్యేక పోలీసు బృందాలను ఎస్పీ మాలికాగార్గ్ నియమించారు. కొత్తగా మరో 1196 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. మాచర్ల నియోజకవర్గంలో 7 ఈవీఎంలను ధ్వంసం చేసిన కేసుల్లో 59 మందిని అరెస్టు చేశారు. పోలింగ్‌కు ముందు రోజు జరిగిన సంఘటనలకు సంబంధించి 33 కేసుల్లో 143 మందిని అరెస్టు చేశారు, పోలింగ్ రోజున 106 కేసుల్లో 883 మందిని, పోలింగ్ తర్వాత రోజు జరిగిన ఘటనల్లో నమోదైన 24 కేసుల్లో 203 మందిని అరెస్టు చేశారు.

నేరస్తులకు హెచ్చరికలు..

నేర చరిత్ర ఉన్న ఏ వ్యక్తి అయినా అదుపుతప్పి ప్రవర్తిస్తూ, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకునేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. అలాంటి వారిపై పీడీ యాక్ట్ నమోదు చేసి అవసరమైతే జిల్లా బహిష్కరణ కూడా చేస్తామని హెచ్చరించారు. సోషల్ మీడియాలో విద్వేషాలు రెచ్చగొట్టే సందేశాలు, ఫొటోలు, వీడియోలు పోస్టు చేసే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. సత్తెనపల్లి టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ రౌడీషీటర్ ఓ రాజకీయ పార్టీ ఆఫీసు వాచ్‌మన్‌పై దాడి చేసి అతడ్ని కొట్టి ఆఫీసును తగల పెడతానని బెదిరించగా ఆ వ్యక్తిని అరెస్టు చేసి జైలుకు పంపించారు.



సత్తెనపల్లిలో పర్యటిస్తున్న సీఐ శ్రీనివాసరావు

నేటి సాయంత్రం నుంచి దుకాణాల బంద్

- హనుమాన్ జయంతి వేడుకల ర్యాలీలు నిషేధం
- పిడుగురాళ్లలో పోలీసు కవాతులో ఎస్పీ మాలికాగార్గ్

ఓట్ల లెక్కింపు గడువు సమీపిస్తోన్న తరుణంలో శాంతిభద్రతలపై పోలీసులు ప్రత్యేక చర్యలకు సిద్ధమయ్యారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంది. అయితే చిరువ్యాపారుల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని కొన్ని సడలింపులు ఇచ్చారు. కౌంటింగ్ సమీపిస్తున్న తరుణంలో శనివారం సాయంత్రం నుంచి నిబంధనలను కఠినతరం చేశారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం 5 గంటల నుంచి దుకాణాలను మూసి వేయాలని ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం ర్యాలీలు, సాంస్కృతిక కార్యక్రమాలకు అనుమతి లేదని, ప్రజలు గుడిలో మాత్రమే స్వామి వారికి పూజలు నిర్వహించుకోవాలని ఎస్పీ మాలికాగార్గ్ తెలిపారు. ప్రజలు ఎక్కడా గుమికూడరాదని ఏదైనా అత్యవసరమైతేనే బయటికి రావాలని సూచించారు. ప్రజలు ఎన్నికల ఫలితాల అనంతరం సంయమనం పాటించాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని ఎస్పీ స్పష్టం చేశారు.

ఎంతటివారినైనా ఉపేక్షించం

పిడుగురాళ్ల: ఎన్నికల ఫలితాల రోజున, తర్వాత గొడవలకు దిగినా, ప్రోత్సహించినా వారు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని పల్నాడు జిల్లా ఎస్పీ మాలికాగార్గ్ తెలిపారు. శుక్రవారం పిడుగురాళ్లలో ఎస్పీ ఆధ్వర్యంలో ప్రత్యేక బలగాలు, మిలటరీ, సాధారణ పోలీసులతో కవాతు నిర్వహించారు. అనంతరం ఐలాండ్ సెంటర్‌లో ప్రజలనుద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ పల్నాడు ప్రాంతంలో ఒకప్పుడు బాగా ఉన్న నక్సలిజం ప్రస్తుతం పూర్తిగా తగ్గిపోయిందన్నారు. ఇటీవల ఎన్నికల పుణ్యమా అని జాతీయ స్థాయిలో పల్నాడుకు ఓ గుర్తింపు వచ్చిందన్నారు. గతంలో ఎప్పుడూ ఎన్నికల సమయంలో ఇంతటి గొడవలు జరగలేదని, ఇప్పుడే ఎందుకు జరుగుతున్నాయో ఆలోచించాలన్నారు. నేతలకు ఏమీ కాదని, సాధారణ వ్యక్తులు ఎందుకు గొడవలకు దిగుతున్నారో అర్థం కావడం లేదన్నారు. ఎన్నికల గొడవల్లో కేసు నమోదైతే జీవితాంతం వెంటాడుతుందన్న విషయం తెలుసుకోవాలన్నారు. జూన్ 1వ తేదీ సాయంత్రం నుంచి 5వ తేదీ వరకు దుకాణాలన్నీ మూసివేయాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీలు రాజు, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, సీఐ ఆంజనేయులు, ఎస్ఐ రబ్బానిఖాన్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మకాలు.. తనిఖీలు



● దాచేపల్లిలో అనుమతులు లేని విత్తనాలను గుర్తించిన విజిలెన్స్ అధికారులు (పాత చిత్రం)

- విత్తనాలపై వ్యవసాయశాఖ హడావుడి
- రైతుల చేతికి అందాక రంగంలోకి అధికారులు
- వేటికి అనుమతులున్నాయో లేవో తెలియక రైతులకు నష్టం
- ఏటా ఆలస్యంగా మేల్కొంటున్న యంత్రాంగం.. వ్యాపారులకు వరం

పిడుగురాళ్ల, మే 31: వరుణుడు కరుణిస్తున్నాడు. సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. వివిధ రకాల విత్తనాలను వ్యాపారులు ఎప్పటి నుంచే అమ్మకాలు చేస్తున్నారు. ధరలు పెరుగుదల, కొరత తదితరాల నేపథ్యంలో రైతులు ముందుగానే విత్తనాలను కొనుగోలు చేసి తెచ్చిపెట్టుకున్నారు. అయితే ఇప్పుడిప్పుడే వ్యవసాయశాఖ మేల్కొంటోంది. నకిలీ విత్తనాలను తేల్చేందుకు అధికారులు రంగంలోకి దుకాణాల్లో తనిఖీలు మొదలుపెట్టారు. చాలావరకు విత్తనాలు రైతుల వద్దకు చేరిపోయాక ఇప్పుడు తనిఖీల వల్ల లాభం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఏవి అసలు.. ఏవి నకిలీ.. వేటి వల్ల లాభం.. అనే విషయాలపై రైతుల్లో గందరగోళం ఉంది. విత్తనాల గురించి రైతులకు చెప్పే వారే లేకుండా పోయారు. వ్యాపారులు చెప్పినట్లు చాలాదగ్గర్ల రైతులు విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. తీరా ఆరుగాలం కష్టపడి చివర్లో దిగుబడి రాక లబోదిబోమంటూ రైతులు రోడ్డెక్కడం ప్రతీ ఏటా పరిపాటిగా మారుతోంది. అయినా వ్యవసాయశాఖ విత్తనాల విషయంలో రైతులకు మేలు చేసే ఆలోచనే చేయడం లేదు. వ్యాపారులకు, విత్తనాల ఉత్పత్తిదారులకు మేలు చేసేలా అధికారుల చర్యలు ఉంటున్నాయన్న విమర్శలు, ఆరోపణలు వస్తున్నా ప్రభుత్వంలో కనీస స్పందన ఉండటంలేదు. కొందరు వ్యాపారులు దిగుబడుల ఆశచూపి రైతులకు విత్తనాలను అంటగడుతున్నారు. తమకు ఎక్కువ కమీషన్ ఇచ్చే కంపెనీల విత్తనాల విక్రయాలపైనే వ్యాపారులు ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలో ఖరీఫ్ సీజన్‌కు ముందే కొందరు వ్యాపారులు విత్తనాల అమ్మకాలు ప్రారంభిస్తున్నారు. ధరలు పెరుగుతాయని, స్టాక్ అయిపోతుందన్న భ్రమచూపి కొందరు వ్యాపారులు సిండికేట్‌గా తయారై రైతులకు విత్తనాలను అంటగడుతూ సొమ్ము చేసుకుంటున్నారు. అనుమతులతో సంబంధం లేకుండానే వ్యాపారులు యథేచ్ఛగా అమ్మకాలు చేస్తున్నారు. అయినా వ్యవసాయశాఖ అధికారులు తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. గత ఏడాది గురజాల మండలం పల్లెగుంతలో కొందరు రైతులు ఓ కంపెనీకి చెందిన పత్తి విత్తనాలను సాగు చేసి తీవ్రంగా నష్టపోయారు. బాధిత రైతులు వ్యవసాయశాఖకు ఫిర్యాదు చేసి ఆందోళన చేశాక కంపెనీ యాజమాన్యం పరిహారం చెల్లించింది. ఇదేదో సీజన్‌కు ముందే అధికారులు తనిఖీలు చేపట్టి విత్తనాలపై రైతులకు అవగాహన కల్పిస్తే మేలు చేసినట్లు. కానీ ఆ దిశగా అటు అధికారులు ఇటు ప్రభుత్వం చర్యలు ఉండటంలేదు.

అధికారుల తీరు ప్రశ్నార్థకం

సీజన్ ప్రారంభ దశలో విత్తనాల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించాల్సిన వ్యవసాయశాఖ మొక్కుబడిగా వ్యవహరిస్తోంది. ఏఏ విత్తనాల కంపెనీల విత్తనాలకు అనుమతులు ఉన్నాయి.. వాటి గడువు తదితర వివరాల బహిరంగ పర్చకుండానే వ్యాపారులు అమ్మకాలు సాగిస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో అమ్మకాలకు అనుమతి లేని పత్తి, మిరప విత్తనాలను కూడా గత ఏడాది పలు ప్రాంతాల్లో యథేచ్ఛగా విక్రయించారు. అంతా అయిపోయిన తర్వాత విజిలెన్స్ అధికారులు వరుసదాడులకు దిగడంతో పల్నాడులో వివిధ ప్రాంతాల్లో అనుమతులు లేని విత్తనాలను రైతులకు అమ్మేసిన విషయాన్ని గుర్తించింది. అయితే అప్పటికే ఆ విత్తనాలతో రైతులు సాగు చేపట్టారు. ఈ ఏడాది కూడా ఇదే పునరావృతమైంది. అనుమతులు లేకుండా అమ్ముతున్న విత్తనాలను దాచేపల్లిలో రెండు రోజుల క్రితం విజిలెన్స్ అధికారులు గుర్తించారు. విజిలెన్స్ అధికారులు వచ్చి పల్నాడులో అనుమతులులేని విత్తనాలను గుర్తిస్తుంటే స్థానికంగా ఉండే వ్యవసాయశాఖ అధికారుల తీరు ప్రశ్నార్థకంగా మారింది. కొందరు వ్యవసాయశాఖ అధికారులు తనిఖీలకు వెళ్లకుండానే పుస్తకాలను కార్యాలయానికి తెప్పించుకుని తనిఖీలు పూర్తయినట్లుగా ముద్ర వేస్తున్నారన్న ఆరోపణలు న్నాయి. ఏదో మొక్కుబడిగా ముందే సమాచారం ఇచ్చి ఎంపిక చేసుకున్న దుకాణాల్లో తనిఖీలతో మమ అనిపించి చేతులు దులుపుకుంటున్న అధికారులు కూడా ఉన్నారు. తనిఖీల పేరిట మామూళ్లను సీజన్‌కు ముందే వసూలు చేసుకుంటున్న వ్యవసాయ అధికారులు ఉన్నారు.



పిడుగురాళ్ల వ్యవసాయశాఖ విత్తన పరీక్షా కేంద్రం

నిబంధనలు పాటించని వ్యాపారులు

విత్తన దుకాణాల ముందు అనుమతులు పొందిన కంపెనీ వివరాలు, నిల్వలు, ధరల పట్టికను బోర్డుపై రాసి బహిరంగంగా ఉంచాలి. ఈ నిబంధనలను కొందరు అధికారులు మామూళ్ల మత్తులో పడి పట్టించుకోవడంలేదు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో చాలా దుకాణాల వద్ద వివరాలు తెలిపే పట్టిక బోర్డును ప్రదర్శిస్తున్న దాఖలాలు లేవు. అనుమతులు లేని విత్తనాలను అంటగడుతున్న దుకాణాలపై చర్యలు తీసుకోవడంలో వ్యవసాయశాఖ మీనమేషాలు లెక్కిస్తుంది. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకున్న విత్తనాలకు అనుమతులు ఉండటంలేదు. ఆయా విత్తనాల కొనుగోలు తరువాత రశీదులు కూడా ఇవ్వకపోవడంతో దిగుబడి, పంట నష్టం జరిగిన సమయంలో తగిన పరిహారం పొందేందుకు రైతులు తంటాలు పడాల్సి వస్తుంది.

86 పీహెచ్‌సీలు 8 కాన్పులు..

- ఉద్యోగులపై వైద్య ఆరోగ్య శాఖ కొరఢా
- విధుల నుంచి ముగ్గురు స్టాఫ్‌నర్సుల ఉద్వాసన
- ఆస్పత్రి ప్రసవాలపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి
- అధికారుల చర్యలతో హడలిపోతున్న క్షేత్రస్థాయి సిబ్బంది
- రాష్ట్ర స్థాయి ఆరోగ్య సూచీల్లో వెనకబడిన ఉమ్మడి గుంటూరు జిల్లా

గుంటూరు సిటీ, మే 31: ఉమ్మడి గుంటూరు జిల్లా 86 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. అయితే కేవలం 8 ప్రసవాలే జరిగాయి. ఆపరేషన్లు వద్దు.. ప్రసవాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని అధికారులు ఆదేశిస్తున్నారు. అయితే ఆస్పత్రి ప్రసవాలపై క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యంగా ఉన్నారని.. అందువల్లే ప్రసవాలు జరగడంలేదని అధికారులు భావించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో అత్తలూరు, ఈపూరు, పొన్నూరు పీహెచ్‌సీల్లో ఒక్కోటి, ఈమనిలో రెండు, వెల్లటూరులో మూడు చొప్పున ఆస్పత్రి ప్రసవాలు జరిగాయి. ఇవి మినహా మిగిలిన కేంద్రాల్లో కాన్పుల జాడే లేదు. కొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గత ఆరు నెలల కాలంలో కనీసం ఒక్కటంటే ఒక్కటి కూడా ఆస్పత్రి ప్రసవం జరగలేదు. దీంతో ఉన్నతాధికారులకు చర్యలకు సిద్ధమయ్యారు. ఆస్పత్రి ప్రసవాలు చేయడంలో వెనుకబడిన ముగ్గురు స్టాఫ్ నర్సులను విధుల నుంచి పూర్తిగా తొలగిస్తూ ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశాలు ఇవ్వడం సంచలనంగా మారింది. గడచిన నెలలో ఆస్పత్రి ప్రసవం ఒక్కటి కూడా చేయనందుకు బాపట్ల జిల్లా పెరవలికి చెందిన సీహెచ్ మాణిక్యం, బీ సువర్చల, ప్రకాశం జిల్లా అమ్మనబ్రోలుకు చెందిన జీ మేరీమమతను ఉద్యోగం నుంచి తొలగిస్తూ గురువారం రాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ ముగ్గురు కూడా సీనియర్ స్టాఫ్ నర్సులు కావడం గమనార్హం. ఆస్పత్రి ప్రసవాలపై మే 25న నిర్వహించిన సమీక్షలోనే సదరు స్టాఫ్ నర్సులను విధుల నుంచి తొలగించాలని అధికారులను కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశించారు. ఆస్పత్రి ప్రసవాల విషయంలో ఉన్నతాధికారులు సీరియస్‌గా ఉండటంతో క్షేత్ర స్థాయి సిబ్బంది హడలిపోతున్నారు. దీంతో వైద్యఆరోగ్య శాఖ ఉద్యోగులకు డెలి'వర్రీ' ఫీవర్ పట్టుకుంది.

అసలు బోణి కొట్టని ఆస్పత్రులెన్నో..

రాష్ట్ర స్థాయి ఆరోగ్య సూచీల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా బాగా వెనకబడింది. ఆస్పత్రి ప్రసవాల్లో అట్టడుగు స్థాయికి పడిపోయింది. ఉమ్మడి జిల్లాలో సుమారు 50 పీహెచ్‌సీలు 24 గంటలు తెరిచే ఉంటున్నాయి. ఆయా కేంద్రాల్లో అనుభవం కలిగిన వైద్యులతో పాటు కాన్పులకు అన్ని రకాల వసతులు కూడా ఉన్నాయి. నియోనేటల్ కేర్ యూనిట్లు కూడా అందుబాటులో ఉన్నాయి. అయినా ఆస్పత్రి ప్రసవాలు జరగకపోవడం గమనార్హం. ఒకటి అర ప్రసవాలకు ఆస్పత్రికి వచ్చినా వైద్యులు తగిన రీతిగా స్పందించక పోవడంతో వచ్చిన కేసులు కూడా ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంటుంది. డాక్టర్లు లేకుండా కాన్పు చేస్తే ఆ తర్వాత సమస్యలు వస్తాయన్న భయంతో స్టాఫ్ నర్సులు సాహసం చేయడం లేదని సమాచారం.

ప్రైవేటుకు వెళ్తే కోతే కోత

గర్భిణులు ప్రైవేటు ఆస్పత్రికి వెళ్తే అన్ని విధాలా నష్ట పోతున్నారు. అక్కడ చాలా సందర్భాల్లో సహజ ప్రసవం జరిగే అవకాశం ఉన్నప్పటికీ ఆపరేషన్ చేసి బిడ్డను తీస్తున్నారు. ఈ ఆపరేషన్ కోసం రూ.40 వేల నుంచి రూ.70 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇదే కాన్పు ప్రభుత్వ ఆస్పత్రిలో జరిగితే ప్రభుత్వమే తల్లికి రూ.5 వేల వరకు చెల్లిస్తుంది. ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్న స్టాఫ్ నర్సులు చాలా వరకు సాధారణ ప్రసవం కొరకు ప్రయత్నం చేస్తారు. ఈ విషయం తెలిసి చాలామంది ప్రభుత్వ ఆస్పత్రికి మొగ్గు చూపుతున్నా వైద్యుల నిర్లక్ష్యం వల్ల కేసు లు వెనక్కి పోతున్నాయి.

కేంద్రాలకు దూరంగా నివాసం

ఆస్పత్రిలో ప్రసవాలు జరగకపోవడానికి ప్రధాన కారణం వైద్యులు అందుబాటులో లేకపోవడమే. చాలా మంది వైద్యులు ఉద్యోగం చేసే ప్రాంతానికి చాలా దూరంలో నివాసం ఉంటున్నారు. గుంటూరు నుంచి జిల్లాలోని నలుమూలలకు వెళ్లి వస్తున్నారు. డాక్టర్ దగ్గరలో లేరన్న సమాధానం ఎక్కువగా వినపడుతుండటంతో ఎక్కువ మంది పీహెచ్‌సీల్లో కాన్పులకు రావడానికి భయపడుతున్నారు. ఆస్పత్రిలో ప్రసవాలు జరగాలంటే అందరి పాత్ర ఉండాలని స్టాఫ్ నర్సులు అంటున్నారు. కేసు ఆస్పత్రికి వస్తే కదా తాము కాన్పులు చేసేదని వారు పేర్కొంటున్నారు. డాక్టర్లు అందుబాటు లో లేకుండా మొత్తం బాధ్యత తమకు అప్పగిస్తే కాన్పు సమయంలో తలెత్తే సమస్యలను తాము ఏ రీతిగా కట్టడి చేయగలమని ప్రశ్నిస్తున్నారు. అందరినీ వదిలి పెట్టి తమపై చర్యలు సహేతుకం కాదని వారంటున్నారు.

ఓటుతో.. ఓటమి



- పాలక పార్టీకి ఉద్యోగులు వ్యతిరేకం
- వారి వ్యతిరేక ఓటుతో అధికార మార్పిడి
- ఈ దఫా అదే జరగనున్నదని సంఘ నేతల ధీమా

గుంటూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగుల వ్యతిరేక ఓటుతో పాలక పార్టీలు ఓటమి బాట పట్టాయి. ప్రతీసారీ ప్రభుత్వాలు మారాయి. 2009 మినహా అంతకముందు, ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో ప్రభుత్వ ఉద్యోగులు రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేయడం ప్రభుత్వాలు మారడం జరిగింది. ఓటింగ్ విధానంలో ఈవీఎంలు ప్రవేశపెట్టిన 2004 నుంచి చూసుకుంటే ఇదే పరిస్థితి పునరావృతమౌతూ వస్తున్నది. ప్రభుత్వ ఉద్యోగులు ఏ పార్టీ వైపు ఎక్కువగా మొగ్గు చూపితే ఆ పార్టీనే ఎన్నికల్లో గెలుపొందుతోన్నది. ఈ దఫా కూడా అదే పరిస్థితి పునరావృతం అవుతుందన్న అభిప్రాయం సర్వత్రా నెలకొన్నది. ఈ నేపథ్యంలో ఎన్నికలకు రెండు, మూడు నెలలు ముందు తమదే అధికారం అని బెట్టింగ్‌లకు పాల్పడిన వైసీపీ నేతలు కౌంటింగ్ రోజున వెలువడే ఫలితాలతో నష్టపోకుండా ఉండేందుకు ఇప్పుడు టీడీపీ తరపున పందేలు కాస్తున్నట్లు సమాచారం. టీడీపీకి వ్యతిరేకంగా బెట్టింగ్‌రాయుళ్లు రాకపోతుండటంతో రూ.లక్షకు రూ.2 లక్షలు ఇస్తామని వల వేస్తున్నారు. 2004 సార్వత్రిక ఎన్నికలకు ముందు వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం తమని ఇబ్బంది పెడుతున్నదని ఉద్యోగులు వ్యతిరేకత పెంచుకున్నా రు. జన్మభూమి, అభివృద్ధి పనుల నాణ్యత తనిఖీలతో స్పాట్ సస్పెన్షన్లు, టీచర్ల బదిలీలు, పని ప్రదేశంలోనే నివాసం ఉండాలన్న నిబంధన వంటి కారణాలతో ఆ ఎన్నికల్లో టీడీపీకి వ్యతిరేకంగా ఓటు వేశారు. దాంతో ఆ ఎన్నికల్లో టీడీపీ ఓటమి పాలైంది. 2009 ఎన్నికలు వచ్చేసరికి ఏ కారణం చేతనో అప్పటి వైసీపీ ప్రభు త్వానికి అనుకూలంగా ఉద్యోగులు ఓటు వేశారు. 2014 సార్వత్రిక ఎన్నికలు వచ్చేసరికి అప్పటివరకు అధికారంలో ఉన్న కాంగ్రెస్ రాష్ట్రాన్ని చీల్చింది. దీనిపై ఉద్యోగ సంఘాల నాయకులే పెద్దఎత్తున ఉద్యమించారు. విడిపోయిన రాష్ట్రాన్ని చంద్రబాబునాయుడు అయితే ముందుకు తీసుకెళ్లారని విశ్వసించారు. దాంతో ఎన్‌డీఏ కూటమికి అండగా నిలిచారు. 2019 వచ్చే సరికి ఉద్యోగులు టీడీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేశారు. తెలంగాణ కంటే మెరుగైన ఫిట్‌మెంట్ చంద్రబాబు ఇచ్చారు. అయినా సీపీఎస్ రద్దు చేస్తానన్న ఒకే ఒక్క హామీతో వైసీపీకి ఓటు వేశారు. దాంతో ఆ ఎన్నికల్లో వైసీపీ ప్రభంజనం సాగింది. అయితే వైసీపీ ప్రభుత్వం మాట తప్పడంతో పాటు సకాలంలో జీతాలు, పింఛన్లు ఇవ్వకపోవడం, ఫేస్ రికగ్నిజేషన్ యాప్ ద్వారా హాజరు తీసుకురావడం, సచివాలయాల వ్యవస్థ తీసుకొచ్చి ఉద్యోగులకు ప్రాధాన్యం లేకుండా చేయడం తదితర కారణాలతో రకరకాల ఆందోళనలతో తమ వ్యతిరేకతని ఏడాది క్రితం నుంచే చూపిస్తున్నారు. ఎన్నికల నాటికి అది తారాస్థాయికి చేరింది. పోస్టల్‌బ్యాలెట్ ఓట్ల రూపంలో ప్రభుత్వంపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. దీంతో ఈఎన్నికల్లో వైసీపీకి ఓటమి తప్పదన్న అభిప్రాయం సర్వత్రా నెలకొన్నది. తాము ఎటు నిలిస్తే ప్రజలు కూడా అటు వైపే ఉంటూ వస్తున్నారని ఉద్యోగసంఘాల నాయకులు ధీమా కనబరుస్తున్నారు.

ఎండల్లో.. తరగతులా?

- నేటి నుంచి ఇంటర్ క్లాసులు ప్రారంభం
- వేసవి దృష్ట్యా భయపడుతున్న విద్యార్థులు
- ఆదివారం.. రెండో విఘ్నం ఉండరాదని కళాశాల

గుంటూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల అనంతరం ఇంటర్మీడియల్ కళాశాలలు శనివారం నుంచి తెరుచుకోనున్నాయి. ఇప్పటికే దీనికి సంబంధించిన సమాచారాన్ని కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు చేరవేశాయి. శని, ఆదివారాల్లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు తరగతులు నిర్వహి స్తామని తెలిపాయి. ఆదివారం సెలవుదినం కదా అని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తే ద్వితీయ విఘ్నం ఉండకూడదని క్లాసులు నిర్వహిస్తున్నామని సమాధానం. కాగా ఒకపక్క 45 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత, సెగలు గక్కుతున్న వాతావరణం, వడగాడ్పులతో ప్రజలు అల్లాడుతున్న సమయంలో కళాశాలలు తెరుస్తుండటంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ దఫా రోహిణి కార్తె ముందువరకు ఎండల తీవ్రత కాస్త తక్కువగానే ఉన్నది. ఎప్పుడైతే మే 25న రోహిణి కార్తె వచ్చిందో ఆ రోజు నుంచి ఎండ భగ్గుమంటోన్నది. రాత్రి అయినా వాతావరణంలో వేడి ఏమాత్రం తగ్గడం లేదు. ఉదయం 8 గంటలకు మొదలు సాయంత్రం 4 గంటల వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటున్నది. మధ్యాహ్నం అడుగు బయట పెట్టాలంటే భయపడిపోయే పరిస్థితి. జూన్ 9 తర్వాత ఎండలు తగ్గుముఖం పడతాయని వాతావరణ శాఖ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు ఈ నెల 4న ఓట్ల లెక్కింపు, 8న రెండో శనివారం. ఈ దృష్ట్యా జూన్ 10 నుంచి తరగతులు ప్రారంభిస్తే విద్యార్థులకు ఇబ్బంది ఉండదన్న అభిప్రాయాన్ని వారి తల్లిదండ్రులు వ్యక్తపరుస్తున్నారు. రెండో విఘ్నం ఉండరాదని ఆదివారం తరగతులు నిర్వహణపై ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు ఆయా కళాశాలలపై చర్యలు తీసుకోవాలంటున్నారు.



ఎన్నికల అధికారికి ఫిర్యాదు పత్రాన్ని అందజేస్తున్న మాజీ మంత్రి దేవినేని ఉమ తదితరులు

ఆ ముగ్గురు అధికారులపై చర్యలు తీసుకోవాలి

ఎన్నికల ప్రధాన అధికారికి టీడీపీ నేతల ఫిర్యాదు

నరసరావుపేట, మే 31: పల్నాడు జిల్లా ఎన్నికల విధుల్లో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తూ అనేక అక్రమాలకు పాల్పడిన డీపీవో విజయభాస్కర్ రెడ్డి, డీఆర్వో వినాయం రెడ్డి, పూడా డిప్యూటీ చైర్మన్ గజ్జల శ్రీనివాస్‌రెడ్డిపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని టీడీపీ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనాకు శుక్రవారం మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, గుంటూరు మిర్చియార్డ్ మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు, న్యాయవాది గూడపాటి లక్ష్మీనారాయణ ఫిర్యాదు చేశారు. ఈ ముగ్గురు అధికారులు పోలింగ్, కౌంటింగ్ సిబ్బందిని నియమించడం, ఇతర అనుమతులు, తదితర అంశాలలో వైసీపీకి అనుకూలంగా వ్యవహరించారని ఆరోపించారు. ఎన్నికల విధులకు సచివాలయ, వీఆర్వోలు, వీఏవోలు తదితర విభాగాల్లో సిబ్బందిని నియమించారు. 4న జరిగే కౌంటింగ్ సమయంలో వీరు వైసీపీ అభ్యర్థులకు అనుకూలంగా వ్యవహరించే అవకాశం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సిఫార్సుల మేరకు వీరిని ఎన్నికల విధుల్లో భాగంగా అత్యంత కీలకమైన పోస్టుల్లో వీరిని నియమించారు. ఈ సమాచారాన్ని ఏప్రిల్ 15వ తేదీన రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి ఫిర్యాదు చేయడం జరిగింది. సదరు ఫిర్యాదుపై విచారణ కోసం పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్‌కు పంపించారు. విచారణ అధికారిగా డీఆర్వో వినాయం రెడ్డిని నియమించారు. కేసును నీరుగార్చడానికే వినాయం రెడ్డికి బాధ్యతలు అప్పగించారు. ఆయన తప్పుడు నివేదిక ఇవ్వడంతో విజయభాస్కర్ రెడ్డిని అక్కడే కొనసాగించారని పేర్కొన్నారు. మాచర్లలో ఈవీఎం పగుల గొట్టడంలో, పోలింగ్ బూత్‌ల్లో దౌర్జన్యంగా ప్రవేశించి పోలింగ్ ఏజెంట్లను వైసీపీ నేతలు భయభ్రాంతులకు గురిచేయడంలో, ఎన్నికల సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలగడానికి విజయభాస్కర్ రెడ్డి, వినాయం రెడ్డి, గజ్జల శ్రీనివాస రెడ్డిలదే పూర్తి బాధ్యత. వీరిపై పూర్తిస్థాయి విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘంను కోరారు.



జై హనుమాన్..

వినుకొండటౌన్, మే31: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని పట్టణానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు బొడ్డుచర్ల ప్రసాద్ గీసిన నాగవల్లి హనుమాన్ చిత్రం పట్టణ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. సంస్కృతంలో తమలపాకుకు పర్యాయపదం నాగవల్లి. ఈ సందర్భంగా ప్రసాద్‌ను పలువురు అభినందించారు.

సజ్జలపై కేసు నమోదుతో వైసీపీలో వణుకు

- ఇప్పటికే పిన్నెల్లి వ్యవహారంతో దడ
- టీడీపీ కార్యాలయంపై దాడి చేసిన వారికి ముచ్చెమటలు

గుంటూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): వైసీపీలో వణుకు మొదలైంది. ఫలితాలు వెలువడటానికి ముందే భవిష్యత్ కళ్ళకు కనపడుతుండటం తో చాలా మంది నేతలు బెంబేలెత్తుతున్నారు. తాజాగా ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిపై కూడా కేసు నమోదు కావడం తో వైసీపీలో పాలుపోని పరిస్థితి ఏర్పడింది. ఇంత కాలం తమకు ఎదురు లేదన్న రీతిలో చట్టాన్ని ధిక్కరించి, అక్రమాలకు పాల్పడిన వైసీపీ చోటా, మోటా నేతలకు ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు పిచ్చెక్కిస్తున్నాయి. గత ఐదేళ్ళ కాలంలో చాలా మంది వైసీపీ ప్రజాప్రతినిధులు, నేతలు మాచర్ల నమూనాను ఉమ్మడి గుంటూరు జిల్లాలో అమలు పరిచారు. అదేమని నోరెత్తిన వారిపై దమన కాండకు పాల్పడ్డారు. ముఖ్యంగా రాజధాని ఉద్యమం సందర్భంగా ఆ ప్రాంతాల్లో ఉన్న రాజకీయ నేతలు అక్కడి మహిళలపై చాలా అమానుషంగా ప్రవర్తించారు. వారు చేస్తున్న ఉద్యమాన్ని వెక్కిరించడంతోపాటు చివరకు వ్యక్తిగతంగా కూడా విమర్శిస్తూ వచ్చారు. చాలా సందర్భాల్లో ఉద్యమ శిబిరాలపై బహిరంగ దాడులకు ప్రేరేపించారు. మహిళలని కూడా చూడకుండా భయంకరంగా కొట్టించారు. అప్పట్లో ఈ వ్యవహారంపై మీడియా గొంతు ఎత్తినప్పటికీ ఏ ఒక్క అధికారి కూడా పెద్దగా పట్టించుకోలేదు. పైగా దాడులకు పాల్పడిన నాయకులకు అండగా నిలబడ్డారు. అదేమని ప్రశ్నించిన మీడియాపై సైతం కేసులు పెట్టి కోర్టులు చుట్టూ తిప్పుతూ వేధిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో అన్ని మండలాల్లోనూ ఇటువంటి సంఘటనలు చాలా జరిగాయి. స్థానిక సంస్థలు ఎన్నికల సందర్భంగా మహిళలు నామినేషన్లు వేయడానికి వెళ్తే కూడా వారిపై వైసీపీ రౌడీ మూకలు బహిరంగంగానే దాడులకు తెగబడ్డారు. నామినేషన్ పత్రాలను చించి వేయడమే కాకుండా, గాయాలయ్యేటట్లు వారిని కొట్టడం జరిగింది. మాచర్లలో మున్సిపల్ ఎన్నికల సందర్భంగా అక్కడికి వెళ్లిన తెలుగుదేశం పార్టీ నేత బుద్దా వెంకన్నపై బహిరంగంగా దాడికి పాల్పడ్డారు. ఆయన కారును కూడా ధ్వంసం చేశారు. ఆఖరికి వాట్సాప్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా వచ్చిన ఒక మెస్సేజ్‌ను ఫార్వార్డ్ చేసిన ఓ వృద్ధ మహిళపై సైతం విచారణ పేరుతో పోలీసులను ఉసి గొలిపి వేధించారు. హోటల్ వ్యాపారం నిర్వహించే ఆ మహిళ వీరి వేధింపులను తాళలేక వ్యాపారాన్ని సైతం వదిలేసుకొని తెలంగాణలో తలదాచుకుంటున్నారు. జిల్లాకు చెందిన సీనియర్ టీడీపీ నేత ధూళిపాళ్ళ నరేంద్రకుమార్‌పై అక్రమంగా కేసులు నమోదు చేపించి జైలు పాలు చేయించటంలో కూడా సజ్జల రామకృష్ణారెడ్డి పాత్ర ప్రధానంగా ఉంది. పొన్నూరు నుంచి వరుసగా ఐదుసార్లు గెలిచిన నరేంద్ర ఆధ్వర్యంలో సంగం డెయిరీ ఉండటమే ఇందుకు కారణం. సంగం డెయిరీ పైనే కాకుండా దానికి అనుబంధంగా రైతులకు రాయితీపై సూపర్‌స్పెషాలిటీ వైద్య సేవలు అందిస్తున్న డీవీసీ హాస్పటల్‌పై కూడా వారి కన్ను పడింది. నరేంద్రను జైలు పాలు చేసి ఆ రెండింటిని వైసీపీ నేతల హస్తగతం చేసేందుకు చేసిన పన్నాగాన్ని నరేంద్ర న్యాయస్థానం అండతో తిప్పి కొట్టారు. ఇక టీడీపీ శ్రేణులు దేవాలయంగా భావించే పార్టీ కార్యాలయాన్ని ధ్వంసం చేయటమే కాకుండా దైవ సమానంగా భావించే పార్టీ అధినేత చంద్రబాబును సైతం జైలు పాలు చేయటాన్ని టీడీపీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయి. ఆ అక్కసు తీర్చుకునే రోజు కోసం ఎదురు చూస్తున్నారు. తాజా పరిణామాలతో అటువంటి నేరాలకు పాల్పడిన నేతల గుండెల్లో రైళ్లు పరిగెత్తుతున్నాయి. వైసీపీకి చెందిన ముఖ్య నేతలపైనే కేసు నమోదు చేయటం, వాళ్ళు ఊర్లు వదిలి పారిపోవటం వంటివి జరు గుతుండటంతో కిందిస్థాయి నేత లు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మాచర్ల నియోజకవర్గంతో పాటు పల్నాడు ప్రాంతంలో పిన్నెల్లి సోదరుల అండ చూసుకొని రెచ్చిపోయిన కింద స్థాయి వైసీపీ నాయకులు పోలీస్ పేరు చెబితే హడలి పోతున్నారు.



ధ్వంసమైన టీడీపీ కార్యాలయం (పాతచిత్రం)

టీడీపీ కార్యాలయంపై దాడి...

రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ జరగని సంఘటనలు ఉమ్మడి గుంటూరు జిల్లాలో జగన్ పాలనలో జరిగాయి. జిల్లాలోని టీడీపీ రాష్ట్ర కార్యాలయంపై, కరకట్ట మీద వున్న చంద్రబాబు ఇంటి పైన కూడా వైసీపీ మూకలు దాడికి పాల్పడ్డారు. ఒక్కసారిగా వందలాది మందితో దేవినేని అవినాష్, జోగి రమేష్ ఈ దాడులకు తెగబడ్డారు. ఈ దాడిలో గుంటూరు జిల్లాకు చెందిన నాయకుల పాత్ర కూడా ఉంది. ఈ రెండు ఘటనలపై స్వయంగా చంద్రబాబు నాయుడు డీజీపీ దృష్టికి తీసుకువెళ్లినా పెద్దగా స్పందించలేదు. డిజిపి కార్యాలయానికి కూత వేటు దూరంలోనే ఇంత విధ్వంసం జరుగుతున్నా అధికారుల స్పందన లేకపోవడం గమనార్హం. ఈ దాడి ద్వారా పైశాచిక ఆనందం పొందిన జగన్ ఆ మేరకు అధికారులను కంట్రోల్ చేయగలిగారు. ఇప్పుడు ఆ దాడుల్లో పాల్గొన్న నేతల గుండెల్లో రైళ్లు పరుగెత్తుతున్నాయి.

రెచ్చిపోయి అక్రమాలు..

జిల్లాలోని వైసీపీ నేతలు గత ఐదేళ్ళ కాలంలో సాగించిన అక్రమాలు చెప్పడానికి రోజులు సరిపోవు. తమను అడిగే వాడు ఎవ్వడు అంటూ రెచ్చిపోయారు. జిల్లాలోని మైన్స్‌ను కొల్లగొట్టారు. ఇసుక రీచ్‌లలో అయితే అక్కడ కడప మాఫీయాను కాపలా పెట్టి మరీ తవ్వకాలు జరిపారు. రీచ్‌లు చూసేందుకు వెళ్లిన టీడీపీ నేతలపై కూడా గొడ్డళ్లు, వేట కొడవళ్లతో దాడులకు పాల్పడ్డారు. కొందరిపై ట్రాక్టర్లు కూడా ఎక్కించి చంపబోయారు. రేషన్ మాఫియా, మట్టి మాఫియా, మద్యం మాఫియా ఇలా జిల్లాలో కొన్ని వేల కోట్లు వైసీపీ నేతలు అడ్డగోలుగా సంపాదించారు. ఇప్పుడు ఆ నేతలు తాము చేసిన అక్రమాలకు ఎన్ని కేసులు పెడతారో అన్న భయం వెంటాడుతోంది. ఈ అక్రమాలన్నీ ఉమ్మడి గుంటూరు జిల్లాలోని తాడేపల్లి ప్యాలెస్ కొలువు తీరిన ప్రభుత్వ సలహాదారు సజ్జల నేతృత్వంలోనే జరిగాయనేది అందరికీ తెలిసిందే. ఆదేశాలు ఇచ్చేది సీఎం జగన్ అయినప్పటికీ అమలు చేసే బాధ్యత అంతా సజ్జల కనుసన్నలలోనే.



వెంకటపాలెంలో జై అమరావతి నినాదాలు చేస్తున్న రాజధాని మహిళలు

వైసీపీ అడ్డగోలు పాలనకు అంతం తప్పదు

1627వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు

తుళ్లూరు, మే31: వైసీపీ అడ్డగోలు పాలనకు అంతం తప్పదని, రాష్ట్రాభివృద్ధిని మరచి, రాజధాని అమరావతిని నిర్వీర్యం చేసినందుకు ప్రజలు ఇచ్చే అంతిమ తీర్పు అదేనని 33వేల ఎకరాలు రాజధాని కోసం త్యాగం చేసిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ మూడు రాజధానులకు వ్యతిరేకంగా రైతులు, రైతు కూలీలు, మహిళలు ధర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద నుంచి చేస్తున్న ఆందోళనలు, నిరసన దీక్షలు శుక్రవారం నాటికి 1627వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడారు. మూడు రాజధానులని అమరావతికి అన్యాయం చేస్తున్నారని వైసీపీ పాలనపై శాంతియుత ఉద్యమం చేస్తుంటే ఆడవారని చూడకుండా లాఠీచార్జ్ చేసి అక్రమ కేసులు వైసీపీ సర్కార్ పెట్టిందన్నారు. పరిపాలన చేత కాని వారికి అధికార పగ్గాలు ఇస్తే.. అంతా విధ్వంసం అవుతుందనటానికి ఈ ఐదేళ్ల వైసీపీ పాలనే నిదర్శనమన్నారు. మూడు ముక్కలాట పెట్టి రాష్ట్ర ప్రజల జీవితాలతో సీఎం జగన్‌రెడ్డి ఆడుకున్నాడని పేర్కొన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ నినాదాలు చేశారు. రాజధాని 29గ్రామాలలో ఆందోళనలు నిరసన దీక్షలు కొనసాగాయి.

ఏఎన్‌యూ ఐసెట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు(తూర్పు), మే 31: ఏఎన్‌యూ ఐసెట్- 2024 విద్యాసంవత్సరానికి సంబంధించి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అడ్మిషన్ల డైరెక్టర్ డాక్టర్ జి.అనిత తెలిపారు. ఏఎన్‌యు ఐసెట్ ద్వారా విశ్వవిద్యాలయంలో ఏడు కోర్సులకు ప్రవేశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో ఎంబీఏ జనరల్, ఏంసీఏ, ఎంబీఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, ఎంబీఏ ఇంటర్నేషనల్ బిజినెస్ స్టడీస్, ఎంబీఏ మీడియా మేనేజ్మెంట్, ఎంబీఏ టూరిజం హాస్పిటాలిటీ మేనేజ్మెంట్, ఎంబీఏ టెక్నాలజీ మేనేజ్మెంట్, ఎంబీఏ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్మెంట్ కోర్సులలో ప్రవేశాలు ఉంటాయని వివరించారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆఫ్‌లైన్ విధానంలో జూన్ 5వ తేదీలోగా ఎటువంటి ఫైన్ లేకుండా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అలాగే 750 రూపాయల ఫైన్‌తో జూన్ 12వ తేదీలోగా, వెయ్యి రూపాయల ఫైన్ తో జూన్ 18వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించుకునే అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష జూన్ 18న నిర్వహించే అవకాశాలున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు విశ్వవిద్యాలయంలోని పీజీ ప్రవేశాల విభాగాన్ని లేదా ఏఎన్ యూ వైబ్‌సైట్ సంప్రదించాలని ఆమె సూచించారు.

భార్య మృతికి కారకుడైన భర్తకు జైలు

నరసరావుపేట లీగల్, మే 31: వరకట్న వేధింపుల నేపథ్యంలో భార్య మృతికి కారకుడైనట్టు నేరం రుజువవ్వటంతో నిందితుడు ఫిరంగిపురంకు చెందిన షేక్ గౌస్‌కు వివిధ నేరాల ప్రకారం ఎనిమిది సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.5500 జరిమానా విధిస్తూ స్థానిక ప్రధాన సహాయ సెషన్స్ న్యాయమూర్తి ఏ పూర్ణిమ శుక్రవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం వివరాలు ఈ విధంగా ఉన్నాయి. నిందితుడికి 2007లో గుంటూరుకు చెందిన మొబీనాతో వివాహం వైంది. ఆ సందర్భంగా రూ 5 లక్షలు నగదు, 30 సంవర్ల బంగారం, మూడు సెంట్ల స్థలం, ఓ మోటారు సైకిల్‌ను ఇచ్చినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. నిందితుడు దుర్వ్యసనాలకు లోనై భార్యను అదనపు కట్నం కోసం వేదిస్తున్నాడని, ఈ నేపథ్యంలో విసిగి వేసారి మొబీనా 2019 నవంబరు 10న ఉదయం ఉరి వేసుకొని చనిపోయింది. ఈ మేరకు మృతురాలి సోదరుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు నమోదు చేసుకున్న పోలీసులు ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువవ్వటంతో శిక్ష మొత్తాన్ని ఏక కాలంలో అనుభవించేలా తీర్పులో పేర్కొన్నారు. ప్రాసిక్యూషన్‌ను ఏపీపీ కేఈ స్వర్ణలత భాను నిర్వహించారు.

సర్వేలు.. లోడింగ్!

- నేటి సాయంత్రానికి అన్ని సర్వేలు వెల్లడి....
- బెట్టింగ్ రాయుళ్ళలో ఆత్రుత



గుంటూరు, మే31 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు ఫలితాలు వెలువడేది వాస్తవానికి నాలుగో తేదీ అయినప్పటికీ శనివారం వెలువడే వివిధ సర్వే సంస్థల ఫలితాలనే ముందస్తు ఎన్నికల ఫలితాలుగా భావిస్తున్నారు పందెం రాయుళ్ళు. కొన్ని సర్వే సంస్థలు గతంలో ఇచ్చిన ముఖ్యంగా తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు నూటికి నూరుపాళ్ళు నిజం కావటంతో ఆ సంస్థల ఫలితాలపై తమ భవితవ్యం ఆధారపడి ఉందని భావిస్తున్నారు. ఇప్పటికే ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా కొన్ని వందల కోట్లలో పందేలు జరిగాయి. అయితే గతంలోలా ఈ పర్యాయం రూపాయికి రూపాయి పందేలు జరగలేదు. వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో ముఖ్యంగా ఉద్యోగ, వ్యాపారవర్గాల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని ఆ పార్టీకి చెందిన వారే పోలింగ్ తేదీ నాటికి గమనించటంతో పందేలు వేసేందుకు ఈసారి హుషారుగా ముందుకు రాలేదు. దీంతో ఎక్కువ శాతం కోసు పందేలే జరిగాయి. రూపాయికి రూపాయన్నరే కాకుండా రెండు రూపాయల పందేలు కూడా జరిగాయి. గత ఎన్నికల్లో పోలింగ్ తేదీ రోజున ఓటరు నాడి అర్థం కాకపోవటంతో టీడీపీ తరఫున బెట్టింగ్ రాయుళ్ళు భారీ ఎత్తున పందేలు వేసి రూ.కోట్లలో నష్టపోయారు. ఈ పర్యాయం వాటిని పూడ్చుకునేందుకు కూటమి తరఫున భారీ ఎత్తున పందేల కు సిద్ధమైనప్పటికీ ఆశించిన రీతిలో వైసీపీ తరుపున పందెం వేసేందుకు బెట్టింగ్ రాయుళ్ళు ముందుకు రాలేదు. దీంతో వారిని బరిలోకి దించేందుకు కోసు పందేలకు దిగాల్సి వచ్చింది. కాగా తమ ప్రభుత్వం వస్తుందని వైసీపీ తరుపున పందేలు వేసేవారు రాకపోవటంతో వైసీపీకి 70కి మించి రావని కొన్ని పందేలు జరుగుతున్నాయి. రాయలసీమతో పాటు నెల్లూరు జిల్లా వరకు కూటమికి 24 సీట్లు వస్తాయని కొన్ని మొదట్లో కొన్ని పందేలు జరిగాయి. ప్రస్తుతం అదే పందెం 32 సీట్లు వస్తాయని జరుగుతున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 17 స్థానాల్లో గాను వైసీపీకి ఐదు కూడా రావని రూపాయికి రూపాయి కొన్ని బెట్టింగ్‌లు జరిగాయి. అలాగే ఉమ్మడి జిల్లాలో వైసీపీకి మూడు కూడా రావని కూటమి తరుపున పందెం కాశారు. మూడు రాని పక్షంలో వైసీపీ తరుపున పందెం వేసే వారు రూపాయికి రెండు రూపాయలు ఇచ్చే విధంగా బెట్టింగ్‌లు జరిగాయి. ఒకటో తేదీ సాయంత్రానికి తమ తమ సర్వేలు వెలువరించేందుకు ఆయా సంస్థలు రంగం సిద్ధం చేసుకున్నాయి.

మైనార్టీ గురుకుల పాఠశాల అడ్మిషన్లు

గుంటూరు(విద్య), మే 31: మైనార్టీ గురుకుల పాఠశాలలో 5,6,7,8 తరగతుల్లో ప్రవేశాల కోసం బాలబాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ జె.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుంటూరులోని నందివెలుగు రోడ్డులో బాలుర కోసం, పొన్నూరు రోడ్డులో బాలికల కోసం ప్రత్యేకంగా గురుకుల పాఠశాలలు ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 12లోగా స్వయంగా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల్ని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాల కోసం 8712625039, 6302018886లో సంప్రదించాలని సూచించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.90
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	150, 159,170
చికెన్ విత్ స్కిన్	286.00
చికెన్ స్కిన్ లెస్	296.00

రెంటచింతలలో భానుడు భగ భగలు



చెట్టు నీడన మూగజీవాలు

రెంటచింతల, మే 31: రోహిణికార్తె తన ప్రభావాన్ని చూపిస్తోంది.. భానుడు భగ భగ మంటూ నిప్పులు కురిపించాడు.. నడినెత్తిన నిప్పుల కుంపటి పెట్టినట్లుగా వుందని మండల వాసులు వాపోతున్నారు. రెంటచింతలలో శుక్రవారం అత్యధిక పగటి ఉష్ణోగ్రత 46 డిగ్రీలుగా నమోదైంది. ఉదయం 9 గంటల నుంచే సూర్యుడు సుర్రుమనిపించాడు. ఎండకు తోడు వడగాల్పులు కూడా వీచాయి. ఇళ్లలోంచి జనం బయటకు రావడానికి వెనుకంజ వేశారు. ఉక్కపోతతో వృద్ధులు, బాలింతలు, గర్భిణులు, పిల్లల బాధ వర్ణణాతీతం. నిత్యం రద్దీతో ఉండే రహదారులు కళావిహీనంగా దర్శనమిచ్చాయి. ఇక నోరు లేని మూగ జీవాల బాధ వర్ణణాతీతం. చెట్లు, పుట్ల నీడన ఉపశమనం పొందాయి.

వారధిపై బ్రేక్‌డౌన్

- ఉదయం ఓ లారీ.. సాయంత్రం మరో లారీ
- విజయవాడ - గుంటూరు మార్గంలో ట్రాఫిక్‌జాం

విజయవాడ, మే 31 (ఆంధ్రజ్యోతి): విజయవాడ - గుంటూరు మార్గంలో రాకపోకలు సాగించాలంటే వారధి దాటా ల్సిందే. ఈ మార్గంలో వారధిపై ఏదైనా వాహనం ఆగిపోయిం దంటే మిగిలిన వాహనదారులు చుక్కలు చూడాల్సి వస్తోంది. శుక్రవారం సరిగ్గా ఇదే జరిగింది. వారధిపై విజయవాడ నుంచి గుంటూరు వైపు వెళ్లే మార్గంలో ఉదయం ఒక లారీ, గుంటూరు నుంచి విజయవాడ వచ్చే మార్గంలో సాయంత్రం ఒక లారీ సాంకేతిక కారణాలతో ఆగిపోవడంతో రెండు వైపులా ట్రాఫిక్ నిలిచిపోయింది. శుక్రవారం ఉదయం భారీ లారీ ఆగిపోవడంతో తాడేపల్లి వరకు ట్రాఫిక్ ఆగిపోయింది. గంటకు పైగా వాహన దారులు అనేక ఇబ్బందులు పడ్డారు. ఉష్ణోగ్రత ఎక్కువగా ఉండడంతో ద్వి చక్రవాహనదారులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మళ్లీ సాయంత్రం ఐదు గంటల తర్వాత విజయవాడ - గుంటూరు మార్గంలో మరో లారీ వారధిపై ఆగిపోయింది. దీంతో కృష్ణలంక, స్క్రూ బ్రిడ్జి వరకు ట్రాఫిక్ ఆగిపోయింది. వారధిపై నుంచి ఆగిపోయిన లారీలను తొలగించిన తర్వాత ట్రాఫిక్ మామూలు పరిస్థితికి వచ్చింది.

కానిస్టేబుల్.. రైతులా..

- వ్యాపారిని వలపన్ని పట్టుకున్న అధికారులు



విత్తనాలు పట్టుకున్న అధికారులు

గుంటూరు సిటీ, మే 31: విత్తనాల వ్యాపారి ఆటకట్టించేందుకు విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు కానిస్టేబుల్‌నే రైతులా మార్చారు. నగరంలోని రాజాగారి తోటలో ఉన్న కుబేరా సీడ్స్‌కు రైతు అవతారంలో వెళ్లిన హెడ్ కానిస్టేబుల్ పోలిరాజు రెండు రకాలకు చెందిన విత్తనాలు కావాలని అడిగారు. ఆ విత్తనాలు తమ దగ్గర స్టాక్ లేవని చెప్పిన షాపు యజమాని నో స్టాక్ బోర్డ్ చూపించారు. వెంటనే రంగ ప్రవేశం చేసిన విజిలెన్స్ అధికారులు సదరు వ్యాపారి రికార్డులు, గోడౌన్‌లో తనిఖీలు నిర్వహించారు. పత్తి విత్తనాల ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. రైతులకు అమ్మకుండా, బ్లాక్ చేసి అధిక ధరకు విక్రయించేందుకు వ్యాపారి వాటిని దాచినట్లు కేసు నమోదు చేశారు. బాలాజీ సీడ్స్, శ్రీ రామా సీడ్స్‌లో కూడా హైబ్రిడ్ మిరప విత్తనాలను పట్టుకున్నారు. వారిపై కేసులు నమోదు చేశారు. ఈ దాడుల్లో విజిలెన్స్ సీఐ ఎస్.శ్రీనివాసులు రెడ్డి, ఏవో రమణ కుమార్, బి.అంజిరెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ఏపీ ఉపాధ్యాయ సంఘ నాయకుడు దశపతిరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీయూఎస్ నాయకులు దశపతిరావు

గుంటూరు(విద్య), మే 31: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం శక్తివంచన లేకుండా నాయకులు పని చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఏపీయూఎస్) నాయకుడు కె.దశపతిరావు తెలిపారు. సంఘం ఆధ్వర్యంలో అరండల్‌పేట యోగిభవన్‌లో శుక్రవారం నిర్వహించిన అభ్యాసవర్గసమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్, ఉద్యోగోన్నతులు, బదిలీల్లో జరిగే సమస్యల గురించి తెలుసుకోవాలన్నారు. రాష్ట్ర మహిళా కార్యదర్శి పి.పద్మ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు, పదో తరగతి మారిన సిలబస్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, శిక్షణా తరగతుల గురించి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.శ్రీనివాసరావు, కె.నాగభారతి, డి.శివపార్వతి, మురళీకృష్ణ, వై.రమ, ఆదినారాయణ, డి.రామాంజనేయులు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో గుంటూరు వైద్య విద్యార్థుల ప్రతిభ

న్యూఢిల్లీ ఎయిమ్స్‌లో ఫస్ట్, సెకండ్ ర్యాంకులు



డాక్టర్ కన్నెగంటి వినీత



డాక్టర్ అత్తోట అఖిల్

గుంటూరు (మెడికల్), మే 31: ప్రతిష్ఠాత్మక న్యూఢిల్లీలోని ఆలిండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) జాతీయ స్థాయిలో సూపర్ స్పెషాలిటీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన పరీక్షల్లో గుంటూరుకు చెందిన ఇద్దరు వైద్య విద్యార్థులు చక్కటి ప్రతిభ కనబర్చారు. మెడికల్, సర్జికల్ సూపర్ స్పెషాలిటీ కోర్సుల్లో ప్రవేశ పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ ర్యాంకులు సాధించి తెలుగు వారి సత్తాను చాటారు. ఎయిమ్స్ న్యూఢిల్లీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నేషనల్ ఇంపార్టెన్స్ సూపర్ స్పెషాలిటీ (ఐఎన్ఐ ఎస్ఎస్) రుమటాలజీ ప్రవేశ పరీక్షలో గుంటూరుకు చెందిన డాక్టర్ కన్నెగంటి వినీత మొదటి ర్యాంకు సాధించారు. ఎంబీబీఎస్‌ను ఎయిమ్స్‌లో పూర్తి చేసిన వినీత, చండీఘర్‌లోని పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ అండ్ రీసెర్చ్‌లో జనరల్ మెడిసిన్‌ను పూర్తి చేశారు. గుంటూరుకు చెందిన డాక్టర్ అత్తోట అఖిల్ ఎయిమ్స్ న్యూఢిల్లీలో ఎంసీహెచ్ సూపర్ స్పెషాలిటీ కోర్సు ఎంట్రన్స్‌లో సర్జికల్ గ్యాస్ట్రో ఎంటిరాలజీ విభాగంలో సెకండ్ ర్యాంక్ సాధించారు. చినకాకానిలోని ఎన్నారై మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి చేసిన అఖిల్, విశాఖపట్నంలోని ఆంధ్ర మెడికల్ కాలేజీ నుంచి జనరల్ సర్జరీ చేశారు. పీజీ కోర్సులో అతడు గోల్డ్ మెడల్ సాధించారు. అఖిల్ తల్లిదండ్రులు ఇద్దరూ వైద్యనిపుణులే. తండ్రి డాక్టర్ అత్తోట సతీష్‌బాబు జనరల్ సర్జన్‌గా, తల్లి డాక్టర్ అత్తోట కవిత చర్మవ్యాధుల వైద్యనిపుణులుగా ప్రాక్టీసు చేస్తున్నారు. వీరి కుటుంబంలో మొత్తం 13 మంది వైద్యులు ఉండటం విశేషం.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



దర్గాలో చద్దర్‌ను సమర్పిస్తున్న కూటమి పశ్చిమ అభ్యర్థి గల్లా మాధవి



గార్డెన్స్‌లోని స్వామివారి ఆలయంలో పూజలు చేస్తున్న గల్లా మాధవి, పెమ్మసాని శ్రీరత్న

ఆంధ్రప్రదేశ్‌లో ఇక స్వర్ణయుగమే! : గల్లా మాధవి

గుంటూరు, మే 31(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో జూన్ 4 తరవాత స్వర్ణయుగం ప్రారంభం కానుందని, నారా చంద్రబాబు నాయుడు అను నేను అన్న పిలుపుతో ప్రజాపాలన మొదలు కాబోతోందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థి గల్లా మాధవి ధీమా వ్యక్తం చేసారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం జీటీ రోడ్డులోని హజరత్ కాలే మస్తాన్ వలి బాబా దర్గాలో శుక్రవారం ఆమె ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బాబాకు ప్రత్యేక చద్దర్‌ను సమర్పించారు. కూటమి అధికారంలోకి వచ్చి ప్రజా రాజధాని అమరావతి త్వరగా పూర్తి అవ్వాలని, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలని ప్రార్థించారు. అనంతరం బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న విష్ణు, లలితా సహస్రనామ పారాయణంలో గుంటూరు ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ సతీమణి శ్రీరత్నతో కలిసి ఆమె పాల్గొన్నారు. చంద్రబాబు చొరవతో రాజధాని అమరావతిలో టీటీడీ వేంకటేశ్వరస్వామి గుడిని నిర్మిస్తే, జగన్‌మోహన్ రెడ్డి తిరుమల ప్రతిష్ఠను మసకబారే విధంగా ప్రవర్తించారని మండిపడ్డారు. రాబోయే ఎన్నికల ఫలితాలు వైసీపీకి దిమ్మ తిరిగే విధంగా చేస్తాయని గళ్ళా మాధవి జోస్యం చెప్పారు. కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ నాయకులు, తెలుగు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

● సినీ హీరో ఘట్టమనేని కృష్ణ జయంతి వేడుకల్లో గల్లా మాధవి పాల్గొన్నారు. గుంటూరు కన్యకా పరమేశ్వరి అమ్మవారి గుడి వద్ద ఏర్పాటు చేసిన కృష్ణ చిత్రపటానికి ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాహసమే ఆయన ఊపిరి అని, తెలుగు సినిమా ఉన్నంతకాలం కృష్ణ పేరు నిలిచి ఉంటుందన్నారు.

గ్రామీణాభివృద్ధిలో కడియాల లక్ష్మి సేవలు అభినందనీయం

● పదవి విరమణ సభలో పలువురు వక్తలు

గుంటూరు(తూర్పు), మే 31 : పట్టుదల, క్రమశిక్షణతో ఉద్యోగ వృత్తి పట్ల అంకితభావంతో 30 ఏళ్లుగా గ్రామ పంచాయతీ కార్యదర్శిగా వివిధ చోట్ల పనిచేసి గ్రామీణాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన కడియాల లక్ష్మి సేవలు అభినందనీయమని డీపీవో శ్రీదేవి, డీఎల్‌పీవో వి.సుజాత, ఎంపీడీవో ఎస్.ఆదినారాయణ గుంటూరు రూరల్ మండల ఎంపీపీ ఇంటూరి పద్మావతి, చల్లావారిపాలెం గ్రామ సర్పంచ్ ఆరుదల సాంబశివరావులు కొనియాడారు. గుంటూరు రూరల్ మండలం చల్లావారిపాలెం గ్రామ పంచాయతీ కార్యదర్శి కడియాల లక్ష్మి పదవి విరమణ శుక్రవారం రూరల్ మండల కార్యాలయంలోని సమావేశ మందిరంలో జరిగింది. కార్యక్రమానికి ఎంపీడీవో ఎస్.ఆదినారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అధికారులు సహోద్యోగులు శాలువాలతో, జ్ఞాపికలు, పూలమాలతో సత్కరించి ఉద్యోగ విధులలో ఉత్తమ ఉద్యోగినిగా కడియాల లక్ష్మి ఏవిధంగా అంకితభావంతో బాధ్యతాయుతంగా పని చేశారో గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కే.శ్రీనివాసరావు, ఎంఈవో వెంకటేశ్వర్లు, ఏఈ రమేష్, హౌసింగ్ ఏఈ సత్యనారాయణ, సూపరింటెండెంట్ శోభారాణి, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మి, వెంగళాయపాలెం సర్పంచ్ లలిత, కడియాల లక్ష్మి కుటుంబ సభ్యులు రావిపాటి నాగేశ్వరరావు, రావిపాటి సాయి కృష్ణ, డాక్టర్ రాధిక, గొల్లపూడి పూజిత, గొల్లపూడి దిలీప్ తదితరులు పాల్గొన్నారు.



కడియాల లక్ష్మి దంపతులను సత్కరిస్తున్న తోటి ఉద్యోగులు

దేవదాయ శాఖ సత్రం లీజు వేలం

గుంటూరు(తూర్పు), మే 31 : అమరావతి రోడ్డులోని గుంటూరు అన్నదాన సమాజ సత్రానికి చెందిన 525 గజాల స్థలాన్ని వేలం పాట నిర్వహించారు. 11 సంవత్సరాల లీజు పద్ధతిలో తీసుకోవడానికి దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. నెలకు రూ.1,93,333 అద్దె చెల్లించేలా కుర్రా వెంకటేశ్వరరావు హెచ్చు పాట పెట్టి లీజు ఖరారు చేసుకున్నారు. దీంతో సత్రానికి ఏడాదికి దాదాపు రూ.23 లక్షల ఆదాయం సమకూరనున్నట్టు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సత్రం కార్య నిర్వాహణాధికారి గుణ్ణం శ్రీనివాసరావు, ఈవోలు కృష్ణారెడ్డి, శ్రీనివాసరావు, యజ్ఞనారాయణ, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

నల్లపాడు పోలీస్‌స్టేషన్ వద్ద అగ్నిప్రమాదం

● రోడ్డు పక్కన పార్కు చేసిన వివిధ కేసుల్లోని వాహనాలు దగ్ధం

స్థానిక నల్లపాడు పోలీస్ స్టేషన్ వద్ద అగ్నిప్రమాదం సంభవించింది. రోడ్డు ప్రమాదంతో పాటు వివిధ కేసుల్లో ఉన్న వాహనాలను సీజ్ చేసి స్టేషన్ సమీపంలోని రోడ్డు పక్కన పార్క్ చేశారు. శుక్రవారం మధ్యాహ్నం వైన్స్ షాప్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు సిగరెట్ తాగి పడేయడం వల్ల అగ్ని ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. దీంతో మూడు కార్లు, ఒక లారీ దగ్ధమయ్యాయి. సీఐ నరేష్ కుమార్ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వటంతో వారు ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, మే 31: విద్యుత్ లైన్‌ల నిర్వహణలో భాగంగా శనివారం బ్రాడీపేట, కోబాల్డ్‌పేట ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ టి సుబ్బరాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

ఆంజనేయునికి వడమాల సేవ

తాడేపల్లి టౌన్, మే 31: శ్రీత్రిదండి చిన్నజీయర్‌స్వామివారి మంగళశాసనా లతో సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంలో హనుమజ్జయంతి ఉత్సవాలు వైభవంగా కొనాగుతున్నాయి. రెండోరోజు శుక్రవారం ఆంజనేయస్వామికి ఉదయం పంచామృతాలతో అభిషేకం అనంతరం మాన్యుసూక్త హోమం, విశేష అలంకరణ, పూర్ణాహుతి, సాయంత్రం తమలపాకులతో స్వామివారికి అష్టోత్తర శతనామార్చన, వడమాల సేవ, మంగళశాసనం తీర్థ ప్రసాదగోష్టి కార్యక్ర మాలు ఘనంగా జరిగాయి. చినజీయర్ ఆశ్రమ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు, ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు, అనంతస్వామి, వేద విద్యార్థులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు ఘనంగా హనుమత్ జయంత్యుత్సవాలు

వట్టిచెరుకూరు: మండల వ్యాప్త గ్రామాల్లో హనుమత్ జయంత్యుత్సవాల్లో భాగంగా గత రెండురోజులుగా వీరాంజనేయస్వామి ఆలయాల్లో వివిధ మహిళా భక్తసమాజ సభ్యులు నిర్విరామంగా హనుమాన్‌చాలీసా పారాయణాన్ని కొనసాగిస్తున్నారు. వట్టిచెరుకూరు, సొపాడు, ముట్లూరు, లేమల్లెపాడు, అనంతవరప్పాడు తదితర గ్రామాల్లోని ఆలయాలను అలంకరించారు.

టిడ్కో కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

మంగళగిరి, మే 31: నగరంలోని టిడ్కో కాలనీలో తలెత్తిన తాగునీటి సమస్య పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటున్నామని నగర కమిషనరు నిర్మల్‌కుమార్ చెప్పారు. ఎంటీఎంసీ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి శుక్రవారం ఆయన టిడ్కో కాలనీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీఐఐసీ రోడ్డులో వున్న పంప్‌హౌస్‌లో వున్న మోటారు కాలిపోవడం వలన నీటి సరఫరాకు అంతరాయం కలిగిందని చెప్పారు. మోటారుకు తక్షణ మరమ్మతులు చేయించి వినియోగంలోకి తేవాలని, అదనపు మోటారును కూడా కొనుగోలు చేసి స్టాండ్‌బైగా వినియోగించాలని అధికారులకు సూచించామన్నారు. అనంతరం కమిషనరు నిర్మల్‌కుమార్ టిడ్కో భవనాలను పరిశీలించారు. ప్రస్తుతానికి సమస్య పరిష్కారమయ్యేంత వరకు ట్యాంకర్ల ద్వారా టిడ్కో వాసులకు నీటి సరఫరా చేస్తామని ఆయన చెప్పారు.

ముక్తినాథ్ వృద్ధాశ్రమాన్ని అనాథ వృద్ధులు వినియోగించుకోవాలి

మంగళగిరి, మే 31: నగరంలోని ముక్తినాథ్ వృద్ధాశ్రమ సేవలను నిరుపేద కుటుంబాలకు చెందిన అనాథ వృద్ధులు వినియోగించుకోవాలని ఆ వృద్ధాశ్రమం అధ్యక్షుడు అవ్వారు వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం స్థానిక గుంటూరు ఛానల్ ఫిల్టర్ బెడ్స్ వెనుక వున్న ఆశ్రమంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ ఆశ్రమంలో వృద్ధులకు వసతితోపాటు భోజన సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. తమ ఈ ఆశ్రమంలో చేరదల్చిన వృద్ధులకు 60 ఏళ్లకు పైబడి వయస్సు వుండాలన్నారు.

ఈసీఐ మార్గదర్శకాల ప్రకారం...

పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు నిర్వహించాలి

● జిల్లా ఎన్నికల అధికారి వేణుగోపాల్‌రెడ్డి స్పష్టీకరణ



కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): పోస్టల్ బ్యాలెట్ ఓట్లు కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం సక్రమంగా లెక్కింపు చేయాలని గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం కలక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ఆయన గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపుపై విధులు కేటాయించిన అదనపు సహాయక రిటర్నింగ్ అధికారులు, వారికి సహాయకంగా నియమించిన ఉద్యోగులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ ఓట్ల వ్యాలిడేషన్‌కు సంబంధించి ఎన్నికల సంఘం తాజాగా జారీ చేసిన మార్గదర్శకాలపై కౌంటింగ్ సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు సక్రమంగా సత్వరమే లెక్కింపు కోసం సహాయకంగా నియమించిన ఉద్యోగులు బాధ్యతగా పని చేయాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపుపై శనివారం రెవెన్యూ కళ్యాణ మండపంలో మరోసారి హ్యాండ్స్ ఆన్ ట్రైనింగ్ కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్, జిల్లా రెవెన్యూ అధికారి పెద్ది రోజా, డిప్యూటీ కలెక్టర్ కె.స్వాతి, గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ సహాయక రిటర్నింగ్ అధికారి భీమారావు, ఐటి నోడల్ అధికారి రఘు, అదనపు సహాయక రిటర్నింగ్ అధికారులు, సహాయక విధులు కేటాయించిన ఉద్యోగులు, అధికారులు పాల్గొన్నారు.

నిజాయితీ గల ఆర్వోను ఎన్నికల విధుల నుంచి తొలగిస్తారా?

● వేములకొండ శ్రీనివాస్



వేములకొండ శ్రీనివాస్

గుంటూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): నిజాయితీపరులైన అధికారుల పని తీరుకు ప్రతిఫలం ఎన్నికల విధుల నుంచి వారిని తొలగించడమేనా అని టీడీపీ యర్రగొండపాలెం నియోజకవర్గ పరిశీలకుడు వేములకొండ శ్రీనివాస్ ప్రశ్నించారు. గుంటూరులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. యర్రగొండపాలెం ఆర్వో శ్రీలేఖను ఎన్నికల విధుల నుంచి తొలగించడం ముమ్మాటికీ వైసీపీ నేతల కక్ష సాధింపు చర్యేనని ఆయన ఆరోపించారు. కౌంటింగుకు ముందు ఆమెను ఎన్నికల బాధ్యతల నుంచి తొలగించడంలో ఆంతర్యమేంటని ఆయన నిలదీశారు. ఒక ఎంపీ అభ్యర్థి వచ్చి వేలు చూపించి బెదిరించినా బెదరకుండా, ప్రలోభాలకు గురిచేసినా లొంగకుండా నిజాయితీగా, సమర్థవంతంగా పని చేసి న్యాయం వైపు నిలిచినందుకు ఆమెను విధుల నుంచి బహిష్కరిస్తారా అంటూ ఆయన ప్రశ్నించారు. వైసీపీ ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి బెదిరింపులకు, దౌర్జన్యాలకు తలొగ్గకుండా నిలిచినందుకే ఆమెపై చర్యలు తీసుకున్నారన్నారు. ఇది ఎన్నికల సంఘం వైఫల్యం కిందకే వస్తుందన్నారు. గుంటూరు పశ్చిమ ఆర్వో రాజ్యలక్ష్మి, పొన్నూరు ఆర్వో లక్ష్మీకుమారిలు నియమ నిబంధనలు తుంగలో తొక్కినా ఎన్నికల కమిషన్ వారిపై చర్యలు తీసుకోకపోవడం అన్యాయమన్నారు. శ్రీలేఖ సస్పెన్షన్‌పై ఈసీ పునరాలోచించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఒక్కో రైతుకు 5 పత్తి విత్తనాల ప్యాకెట్లు

● విత్తన కొరత నివారణకు వ్యవసాయ శాఖ చర్యలు

గుంటూరు సిటీ, మే 31 : విత్తన కొరత నివారణకు గుంటూరు జిల్లా వ్యవసాయ శాఖ చర్యలు చేపట్టింది. శుక్రవారం ఉదయం నుంచి నగరంలోని విత్తనాల దుకాణాల్లో వ్యవసాయ శాఖ అధికారులు మకాం వేసి అమ్మకాలు చేపట్టారు. విత్తనాల కోసం వచ్చిన రైతుల పాసు పుస్తకాలు పరిశీలించి వారు ఈ జిల్లాకు చెందిన వారే అని నిర్ధారించిన తర్వాత అమ్మకాలు జరుపుతున్నారు. ప్రస్తుతం కేవలం గుంటూరు జిల్లాకు చెందిన రైతులకు మాత్రమే పత్తి విత్తనాలు అమ్ముతున్నట్లు అధికారులు వెల్లడించారు. ఒక్కో రైతుకు సాగు విస్తీర్ణం ఆధారంగా గరిష్టంగా 5 ప్యాకెట్లను అందజేస్తున్నారు. నగరంలోని రాజాగారితోట, ఏటుకూరు రోడ్డులో ఉన్న విత్తనాల దుకాణాల్లో జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏవోలు అమ్మకాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డీఏవో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రెండు కంపెనీలకు చెందిన విత్తనాలకు మాత్రమే కొంత కొరత ఉందని, మిగిలిన కంపెనీలకు చెందిన విత్తనాల నిల్వలు పుష్కలంగా ఉన్నాయని చెప్పారు. నూజివీడు సీడ్స్‌కు చెందిన సూపర్ బంటీ విత్తనాలు గురువారం 1530 ప్యాకెట్లు అర్బన్ పరిధిలోని దుకాణాలకు వచ్చాయని అన్నారు. స్టాక్ వచ్చిన వెంటనే స్టాప్ సేల్ ఆదేశాలు ఇచ్చామన్నారు. వాటిని వ్యవసాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో శుక్రవారం విక్రయాలు జరిపే విధంగా చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ సునీల్, ఏవోలు భవనం అంజిరెడ్డి, బి.కిషోర్, విస్తరణ అధికారులు ఆర్‌వీ శివాజీ, వి.ఆనంద్ పాల్గొన్నారు.

పట్టాలు దాటేందుకు గూడ్స్ బోగి ఎక్కిన యువకుడు

● హై టెన్షన్ వైరు ప్రభావంతో గాయాలు

గుంటూరు, మే 31 : గుంటూరు రైల్వే స్టేషన్‌కు సమీపంలోని శంకర్ విలాస్ ఓవర్ బ్రిడ్జి వద్ద రైలు పట్టాలు దాటేందుకు గూడ్స్ భోగీ ఎక్కి యువకుడు ప్రమాదానికి గురయ్యాడు. జీఆర్‌పి సీఐ గంగా వెంకటేశ్వర్లు కథనం మేరకు మహారాష్ట్రలోని నాగపూర్ ప్రాంతానికి చెందిన షేక్ వాసిం (31) గుంటూరులో ని చిన్న హోటళ్ళలో వంట మాస్టర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇదిలా ఉంటే శుక్రవారం మధ్యాహ్నం బ్రాడీపేట ఒకటో లైన్లో రైలు పట్టాలు దాటాలని భావించాడు. ఆ సమయంలో పట్టాలపై గూడ్స్ రైలు ఆగి ఉంది. కింద నుంచి వెళితే గూడ్స్ కదులుతుందేమోననే ఉద్దేశంతో భోగీ పైకి ఎక్కాడు. రైల్వే పైన హై టెన్షన్ విద్యుత్ వైర్ ఉండడంతో ఆ ప్రభావంతో ఒకసారిగా విద్యుదాఘాతానికి గురై దూరంగా ఎగిరిపడ్డాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో 108లో తరలించారు. చేతులు, కాళ్లు, వీపుపై కాలిన గాయాలు ఏర్పడ్డాయి. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



విజేతలతో అసోసియేషన్ సభ్యులు

ముగిసిన స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీలు

గుంటూరు(తూర్పు), మే 31 : స్థానిక గుంటూరు క్లబ్‌లో అండర్-10, 12 బాల, బాలికలు అండర్-15 బాలుర విభాగాల్లో నిర్వహించిన స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీలు శుక్రవారంతో ముగిసాయి. అండర్-10, 12 బాలికల విభాగంలో హంస్రిక, రచన, బాలుర విభాగంలో షాజ్, సంజీవన్ సాయి, అండర్-15 విభాగంలో మున్నా ప్రథమ స్థానంలో నిలిచారు. ముగింపు కార్యక్రమంలో గుంటూరు క్లబ్ కార్యదర్శి ఎన్.సాంబశివరావు, సభ్యులు శ్రీనివాసరావు, కోచ్ జీ.నాగేశ్వరరావు, జీ.వృథ్వీ పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు.



కృష్ణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తాడిశెట్టి మురళీ, శ్రీను తదితరులు

సినీ కళామతల్లి ముద్దు బిడ్డ కృష్ణ

గుంటూరు, మే 31: సినీ కళామతల్లి ముద్దుబిడ్డ సూపర్ స్టార్ కృష్ణ అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తాడిశెట్టి మురళి మోహన్ కీర్తించారు. సూపర్‌స్టార్ కృష్ణ 81వ జయంతి సందర్భంగా శుక్రవారం పట్టాభిపురంలోని తాడిశెట్టి కార్యాలయంలో సూపర్ స్టార్ కృష్ణ సీనియర్ అభిమానులు జాలాది రవి, మిరంపల్లి శ్రీను, ప్రిన్స్ మహేష్‌బాబు ఫ్యాన్స్ నగర అధ్యక్షుడు కొండెబోయిన శ్రీను ఆధ్వర్యంలో జయంతి వేడుకలు జరిగాయి. అనంతరం కేక్‌ను కట్ చేసి పంచి పెట్టారు. టీడీపీ కూటమిలోని శ్రేణులు, కృష్ణ అభిమానులు పాల్గొన్నారు.



ఉద్యోగ విరమణ చేసిన అధికారులతో అదనపు ఎస్పీ శ్రీనివాసరావు

పోలీస్ శాఖకు మీ సేవలు అభినందనీయం

● అదనపు ఎస్పీ శ్రీనివాసరావు

గుంటూరు, మే 31 : సుదీర్ఘ కాలంపాటు పోలీస్ శాఖకు అంకిత బావంతో మీరందించిన సేవలు అభినందనీయమని అదనపు ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. గుంటూరు జిల్లా పోలీసు విభాగం లో పనిచేస్తూ పదవి విరమణ చేసిన ఏడుగురు అధికారులను జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు క్రైమ్ అదనపు ఎస్పీ శ్రీనివాసరావు వారిని ఘనంగా సత్కరించి ఆత్మీయ వీడ్కోలు పలికి ఘనంగా సన్మానించారు. పదవీ విరమణ చేసిన వారిలో ఎస్ఐ రామ బ్రహ్మం, డీసీఆర్బి ఆర్ఎస్ఐ వి.వెంకటరావు, ఎంఆర్ఆర్ ఎస్ఐ, ఏఎస్ఐ ఎన్.వెంకటేశ్వరరావు, నల్లపాడు పోలీసు స్టేషన్ ఏఎస్ఐ దుర్గా ప్రసాద్, అరండల్‌పేట పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ మల్లిఖార్జున రావు తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో క్రైం అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, ఆర్ఐ శ్రీహరిరెడ్డి, గుంటూరు జిల్లా పోలీస్ అసోసియేషన్ ప్రతినిధులు కరుణాకర్, కరిముల్లా, లక్ష్మణ్, షైలా సాంబశివరావు పాల్గొన్నారు.

అల్లర్లు చేసి జైలుకు వెళ్లవద్దు

తుళ్లూరు, మే 31: కౌటింగ్ రోజు జూన్ 4న, ఆ తరువాత అల్లర్లు చేసి, గొడవలు పడి జైలుకు వెళ్లవద్దని తుళ్లూరు సీఐ సుబాని హెచ్చరించారు. మండల పరిధిలోని వడ్డమానులో శుక్రవారం పీస్ కమిటీతో సమావేశం నిర్వహించారు. ఏ పార్టీ వారైనా సరే గొడవలు, అల్లర్లు సృష్టించటం, రెచ్చగొట్టటం వంటి చర్యలు చేస్తే నాన్ బెయిల్‌బుల్ సెక్షన్‌ల కింద కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. 144 సెక్షన్ అమలులోవుందని నలుగురికు మంచి గుమికూడవద్దని తెలిపారు. ర్యాలీలు నిషేధమన్నారు.ర్యాలీకి ఉపయోగించిన ఏ వాహనాన్నైనా సీజ్ చేస్తామన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నం దున ఏ చిన్న ఘటన జరిగినా ఉపేక్షించమన్నారు. చట్టపరంగా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో గ్రామ పెద్దలు, పీస్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



వడ్డమానులో పీస్ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న సీఐ సుభానీ

5 వరకు 144 సెక్షన్ అమలు

తాడికొండ: జూన్ 4న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ఫలితాల కౌటింగ్ నేపథ్యంలో 5వ తేదీ వరకు మండలంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని తాడికొండ సీఐ ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం తాడికొండ పోలీస్ స్టేషన్‌లో విలేకర్లతో సీఐ మాట్లాడుతూ రాత్రి 8గంటల నుంచి మండలంలోని గ్రామాల్లో వ్యాపారదుకాణాలు మూసివేయాలన్నారు. పోలీసు గస్తీ నిత్యం ఉంటుందన్నారు. 3, 4, 5తేదీలో పూర్తిగా మద్య నిషేధం ఉంటుంద న్నారు. గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఎన్నికల ఫలితాలు విడుదల సందర్భంలో ర్యాలీలు, ఊరేగింపులు, క్రాకర్స్ కాల్చటం నిషేధమన్నారు. జూన్ 3 రాత్రి మండలంలోని ఉన్న రౌడీషీటర్లు పోలీస్‌స్టేషన్‌లో హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు డీ.రవీంద్రబాబు, జీ అంజయ్య పాల్గొన్నారు.

దుగ్గిరాల, పేరుకలపూడిలో పోలీసు కవాతు

దుగ్గిరాల, మే 31: దుగ్గిరాలతోపాటు, పేరుకలపూడి గ్రామంలో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈనెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల ఫలితాలు జూన్ 4న తెలియనుండటంతో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా గ్రామాల్లోని కూడళ్లలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ గ్రామాల్లోని అన్ని వీధుల్లోనూ తిరుగాడారు. అల్లర్లకు పాల్పడిన వారిపై కఠినచర్యలు తీసుకుంటామని, చట్టపరంగా కేసులు పెట్టడం జరుగుతుందని, ర్యాలీలు, సభలు, సమావేశాలు, బాణాసంచా పేల్చ డం వంటి కార్యక్రమాలకు పాల్పడితే పోలీసువారి దృష్టికి తీసుకురా వాలని, చెబుతూ కవాతు కొనసాగించారు. ఇప్పటికే గత నాలుగు రోజులుగా ఆటోలో మైక్‌ద్వారా ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం కల్పించేందుకు ప్రజలందరూ సహకరించాలని, 144వ సెక్షన్ అమలులో ఉన్నందున దుకాణాలు, హోటల్లో ఇతర వ్యాపారసంస్థలు నిర్ధిష్ట సమయంలోగా మూసివేయాలని కోరారు. సీఐ వెంకట్రావు, ఎస్సై మహేంద్ర, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.



దుగ్గిరాల వీధుల్లో కవాతులో పాల్గొన్న సీఐ వెంకట్రావు, ఎస్సై మహేంద్ర, పోలీసులు

బాలలు వంద శాతం భోజనం చేయాలి

ఫిరంగిపురం, మే 31: బడులలో విద్యార్థులు వందశాతం భోజనం చేసేలా చూడాలని ఎంఈవో షేక్ మహబూబ్‌సుభానీ అన్నారు. శుక్రవారం ఫిరంగిపురంలోని సెయింట్‌పాల్స్ హైస్కూల్‌లో మండలస్థాయిలో భోజనఏజెన్సీలకు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భోజనం నాణ్యతలలో రాజీ పడకూడద న్నారు. ఏజెన్సీలకు వంటపోటీలు నిర్వహించి వారికి బహుమతులను అందజేశారు.

ఉపాధి కూలీలకు కనీస వసతుల కరవు

దుగ్గిరాల, మే 31: ఉపాధిహామీ కూలీలకు మంచినీరు, విరామ సమయంలో వేచియుండేందుకు టెంట్‌లు కూడా ఏర్పాటు చేయడం లేదని వ్యవసాయకార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు జెట్టి బాలరాజు పేర్కొన్నారు. మండలంలోని పలుగ్రామాల్లో జరుగుతున్న జాతీయ ఉపాధిహామీ పనుల చేస్తున్న వ్యవసాయకూలీలను శుక్రవారం ఉదయం కలిసిన బాలరాజు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.



కొత్తపేట ఆంజనేయస్వామి ఆలయంలో నిర్వహించిన గ్రామోత్సవంలో స్వామి వారు, భక్తులు

వాయుపుత్రుడికి గ్రామోత్సవం

గుంటూరు(తూర్పు), మే 31: స్థానిక కొత్తపేట శ్రీ ఆంజనేయస్వామి వారి దేవస్థానంలో హనుమత్ జయంతోత్సవాల్లో భాగంగా స్వామి వారికి శుక్రవారం ఉదయం లక్ష ఆకుపూజ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి గ్రామోత్సవం వేడుకగా జరిగింది. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. శనివారం హనుమత్ జయంతి సందర్భంగా స్వామి వారికి సహస్ర ఘటాభిషేకం, సాయంత్రం స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్నట్టు దేవస్థానం ఛైర్మన్ తిరువల్లూరు వెంకట సుబ్బారావు తెలిపారు. కార్యక్రమాలను హనుమాన్ దీక్షా సమాజ సభ్యులు నాగేశ్వరరావు, అనిల్‌కుమార్, వంశీ, జగదీష్, రమేష్, రమణ పర్యవేక్షించారు.

● పాతగుంటూరు. శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో హనుమాన్ జయంత్సోవాల్లో భాగంగా నాలుగో రోజున స్వామి వారికి ప్రభాతసేవ, ఆలయ ప్రదక్షణలు మంత్ర పుష్పం, ప్రసాద వినియోగం, విష్వక్సేన ఆరాధన, సుందరకాండ, నారసింహ హోమాలు, లక్ష నాగవల్లీ దళార్చన వేద పండితులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవాలను ఆలయ కమిటీ అధ్యక్షులు కొప్పురావూరి బాబురావు, కార్యదర్శి కాసుల సాంబశివరావు, గ్రంధి కోటేశ్వరరావు, ఆత్మకూరి లక్ష్మణరావు, నాగమల్లేశ్వరరావు పర్యవేక్షించారు.

● స్థానిక ఏటుకూరు బైపాస్, శ్రీ అభయ ఆంజనేయస్వామి వారి దేవస్థానంలో హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం చండీ హోమం, బాలపూజ, సాయంత్రం సుందరకాండ అహోరాత్ర హోమం, లక్ష తమలపాకుల అర్చన, 79 కిలోల లడ్డుతో స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. జూన్ 1 హనుమన్ జయంతి సందర్భంగా ఉదయం మహా పూర్ణాహుతి, 79 కేజీల లడ్డు వేలం పాట, మహా అన్నదానం, సాయంత్రం స్వామివారి శాంతి కల్యాణం నిర్వహిస్తున్నట్టు ఆలయ వ్యవస్థాపకులు బండారు సాంబశివరావు తెలిపారు.



వైఎస్ కృష్ణేశ్వరరావును సత్కరిస్తున్న నిర్వాహకులు

సినీనటుడు కృష్ణేశ్వరరావుకు ఘన సత్కారం

గుంటూరు(తూర్పు), మే 31 : స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై అక్కిరాజు ఆర్ట్స్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రముఖ రంగస్థల, సినీ నటుడు, రచయిత, దర్శకుడు వైఎస్ కృష్ణేశ్వరరావుకు ఘన సత్కారం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభకు రచయిత, నాటకరంగ పరిశోధకుడు డాక్టర్ కందిమళ్ళ సాంబశివరావు అధ్యక్షత వహించారు. అతిథులుగా అప్పాజోస్యుల విష్ణుభొట్ల ఫౌండేషన్ స్థాపకుడు అప్పాజోస్యుల సత్యనారాయణ, సనాతన ధర్మ ప్రచారకులు యాబలూరి లోకనాథశర్మ, సంస్థ అధ్యక్షులు డాక్టర్ అక్కిరాజు సుందరరామకృష్ణ, ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, కోశాధికారి లంకా సూర్యనారాయణ, ప్రముఖ రంగస్థల నటుడు, రచయిత, దర్శకుడు కావూరి సత్యనారాయణ, సంస్థ కార్యదర్శి పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొని కృష్ణేశ్వరరావును ఘనంగా సత్కరించారు. సభానంతరం డాక్టర్ అక్కిరాజు సుందరరామకృష్ణచే భక్తిచింతామణి నాటకంలోని బిల్వమంగళుడు ఏకపాత్రాభినయం చేసి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. వయోలిన్‌పై పాణ్యం దక్షిణామూర్తి సంగీత సహకారం అందించారు.



టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడును గుంటూరు తూర్పు నియోజకవర్గ కూటమి అభ్యర్థి నసీర్ మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాదులోని చంద్రబాబు నివాసంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ప్రజలు టీడీపీకి అనుకూలంగా ఉన్నారని అధినేతతో చెప్పారు.



పదవీ విరమణ చేసిన ఏబీ వెంకటేశ్వరరావును టీడీపీ నేతలు కసుకుర్తి హనుమంతరావు, ఈరంటి వరప్రసాద్, హేమంత్, ఎం.కోటేశ్వ రరావు తదితరులు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

వైసీపీ అరాచక శక్తులను నిలువరించాలి: చందు

తుళ్లూరు, మే 31: కౌంటింగ్ సమయంలో వైసీపీ అరాచక శక్తులను ఎదుర్కోటానికి టీడీపీ కూటమి ఏజంట్‌లు అప్రమత్తంగా ఉండాలని తాడికొండ నియోజకవర్గ టీడీపీ ఆర్టీఎస్ కోఆర్డినేటర్ నెలకుదిటి చందు పిలుపునిచ్చారు. శుక్రవారం తుళ్లూరు ఆర్టీఎస్ కార్యాలయంలో విలేకరులతో చందు మాట్లాడారు. ప్రభుత్వసలహాదారు సజ్జల వ్యాఖ్యలను బట్టి చూస్తే, కూటమి అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలవబోతున్నారన్నారు. అందుకే వైసీపీ ఏజంట్‌లు అల్లర్లు, గొడవలకు దిగాలని సూచన చేసినట్టు తెలుస్తోందన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్, ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ అత్యధిక మెజార్టీతో గెలవబోతున్నారని చెప్పారు. వైసీపీ అరాచకశక్తులపై ఈసీ ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. వైసీపీ అలజడులు సృష్టిస్తే వీడియోలు, ఫొటోల ద్వారా రక్షణ వ్యవస్థకు, ఈసీకి సమాచారం ఇచ్చి చర్యలు తీసుకునేలా టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులుండాలని కోరారు.

రాష్ట్రాన్ని నట్టేట ముంచిన ప్రభుత్వం

తాడికొండ, మే 31: మూడు రాజధానుల ప్రకటనతో వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని నట్టేట ముంచిదని రైతులు, మహిళలు వాపోయారు. మూడు రాజధానులకు వ్యతిరేకంగా, రాజధాని రైతులకు మద్దతుగా, బిల్డ్ అమరావతి పేరిట తాడికొండలో రైతులు, మహిళలు శుక్రవారం నిరసనలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే రాజధానికి భూములు ఇచ్చిన రైతులతో సమావేశమై సమస్యలను పరిష్కారించాలన్నారు. సచివాలయం, అసెంబ్లీ రెండుచోట్ల ఉండటానికి వీల్లేదని, రెండు ఒకేచోట ఉండాలని డిమాండ్ చేశారు. రాజధానికి భూములు ఇచ్చిన రైతులలో 27 వేల మంది రైతులు 5 ఏకరాల లోపు ఉన్నవారేనన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందాలంటే విశాఖ రైల్వేజోన్ ఏర్పాటుచేయటం వలన అక్కడ అనేక పరిశ్రమలు రావటంతో అభివృద్ధి చెందుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా జోన్ ఇస్తానని చెప్పినా ఇంతవరకు ఆ ఊసే లేదన్నారు. రాష్ట్రానికి రావాల్సిన వనరులను తెచ్చుకోవటంలో ప్రభుత్వం విఫలమైందన్నారు.

సినిమా చూడకుండానే రివ్యూ ఇస్తున్నారు



విష్వక్‌సేన్

'సినిమా చూసి నిజాయితీగా సమీక్ష రాయడంలో తప్పు లేదు. కానీ కొంత మంది సినిమా చూడకుండానే ఆ పని చేస్తున్నారు. మరికొందరు కావాలనే నెగెటివ్ రివ్యూలు రాస్తున్నారు. అయితే వాటిని పట్టించుకోకుండా ప్రేక్షకులు 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' చిత్రాన్ని చూసేందుకు వస్తున్నారు' అని హీరో విష్వక్‌సేన్ అన్నారు. ఆయన హీరోగా కృష్ణచైతన్య దర్శకత్వం వహించిన ఈ చిత్రం శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా విష్వక్‌సేన్ మీడియాతో మాట్లాడుతూ 'కొన్నాళ్లుగా థియేటర్ల దగ్గర ప్రేక్షకుల సందడి కనిపించ లేదు. ఇప్పుడు మా 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' చిత్రం కోసం మళ్లీ ప్రేక్షకులు థియేటర్ల బాట పడుతున్నారు. మా సినిమాకు వస్తున్న ప్రేక్షకాదరణకు చాలా ఆనందంగా ఉంది. 'విష్వక్ సినిమాల ఎంపికలో వైవిధ్యం చూపుతార'ని ప్రశంసలు వస్తున్నాయి. నాలోని నటుడిగా సవాల్ విసిరేలా ఉంటేనే సినిమా చేయడం అలవాటు. ఇకముందు కూడా ఇలాంటి కొత్తదనం ఉన్న కథలతో వస్తాను' అన్నారు. 'బాలకృష్ణ గారు, వారి కుటుంబ సభ్యులు 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' సినిమా బావుందని మెచ్చుకున్నారు. మంచి వసూళ్లు వస్తున్నాయని అన్ని ఏరియాల డిస్ట్రిబ్యూటర్లు ఫోన్ చేసి చెప్పారు. దీనికి త్వరలోనే సీక్వెల్ చేస్తాం' అని కృష్ణ చైతన్య చెప్పారు.

మూడు పాత్రల చుట్టూ తిరిగే కథ

శర్వానంద్ హీరోగా నటించిన 35వ చిత్రం 'మనమే' ఈ నెల 7న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్రకథానాయిక కృతి శెట్టి శుక్రవారం ఈ సినిమా విశేషాలను మీడియా సమావేశంలో వెల్లడించారు.

- ఈ సినిమాలో నా పాత్ర పేరు సుభద్ర. ఇప్పటివరకూ చేసిన పాత్రలకు భిన్నంగా ఉంటుంది. క్యూట్, సాఫ్ట్, బబ్లీ క్యారెక్టర్స్ చేసిన నాకు ఈ పాత్ర చాలా కొత్తగా అనిపించింది. 'ఇంత స్ట్రిక్ట్‌గా ఉండాలా' అని దర్శకుడు శ్రీరామ్‌ను అడిగాను. అలాగే కావాలనడంతో ఆయన్ని ఫాలో అయ్యా.
- శర్వానంద్ అద్భుతంగా నటించారు. నిన్నే సినిమా చూశా. ప్రతి సీన్‌లో ఆయన అదరగొట్టారు. ఇందులో నా ఫేవరెట్ సీన్ ఒకటుంది. దాని కోసం చాలా వెయిట్ చేశా. ఎలా చేయాలా అని ఆలోచించా. కానీ శర్వానంద్ చాలా క్యాజువల్‌గా వచ్చి ఒకే ఒక్క నిమిషంలో ఆ సీన్ చేయడంతో చాలా ఆశ్చర్యపోయా.
- స్ట్రాంగ్ ఎమోషన్స్ కలిగిన ఎంటర్‌టైనింగ్ ఫిల్మ్ 'మనమే'. కిడ్, పేరెంట్ ఎమోషన్ కూడా ఉంది. గ్లోబల్ ఆడియన్స్‌కు కనెక్ట్ అవుతుంది. శర్వానంద్, నేను, పాప.. ఈ మూడు పాత్రల చుట్టూ తిరిగే కథ ఇది. అందుకే 'మనమే' అని పేరు పెట్టారు.
- చిత్రం షూటింగ్ లండన్‌లో జరిగింది. అక్కడి వెదర్ ఎప్పటికప్పుడు మారిపోయేది. ఒక్కోసారి హఠాత్తుగా వర్షం పడేది. అటువంటి వాతావరణంలోనూ నిర్మాత చక్కగా ప్లాన్ చేయడం వల్ల షూటింగ్ బాగా జరిగింది.
- ప్రస్తుతం మూడు తమిళ చిత్రాల్లో నటిస్తున్నాను. అలాగే ఓ మలయాళ సినిమా కూడా చేస్తున్నాను.





జేమ్స్‌బాండ్ ఇన్ కుప్పం

సుధీర్‌బాబు నటిస్తున్న తాజా చిత్రం 'హరోంహర'. జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వంలో సుమంత్ నాయుడు గ్రాండ్‌గా నిర్మించిన ఈ యాక్షన్ థ్రిల్లర్ థియేట్రికల్ ట్రైలర్‌ను సూపర్‌స్టార్ కృష్ణ జయంతి సందర్భంగా విడుదల చేశారు. ఈ ట్రైలర్‌ను మహేశ్‌బాబు సోషల్ మీడియా ద్వారా విడుదల చేసి, సుధీర్‌బాబుకు, టీమ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ట్రైలర్ లాంచ్ వేడుకకు దర్శకులు అనిల్ రావిపూడి, సంపత్ నంది హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అనిల్ రావిపూడి మాట్లాడుతూ 'సుధీర్‌బాబు రాంబోలా ఉంటాడు. ఇందులో జేమ్స్‌బాండ్ ఇన్ కుప్పం అని చెప్పడం ఆసక్తికరంగా ఉంది. రాయలసీమ యాస లో సుధీర్‌బాబు అద్భుతంగా మాట్లాడారు. ఆయన కెరీర్‌లోనే ఇది బిగ్గెస్ట్ హిట్ కావాలి' అని కోరారు. 'ట్రైలర్ టెర్రిఫిక్‌గా ఉంది. విజువల్స్ బాగున్నాయి. సినిమా పెద్ద హిట్ కావాలి' అన్నారు సంపత్ నంది. సుధీర్‌బాబు మాట్లాడుతూ 'యాక్షన్ సినిమా చేయమని కృష్ణ గారు చాలా సార్లు చెప్పారు. ఈ సినిమా ఆయనకు ఆనందం కలిగిస్తుందని నమ్ముతున్నా. ఇండియన్ సినిమాలో 'హరోంహర' లాంటి బ్యాక్‌డ్రాప్ ఉన్న సినిమా రాలేదనే చెప్పాలి. యాక్షన్ సీన్లు టాప్ రేంజ్‌లో ఉంటాయి. నిర్మాతలు బాగా ఖర్చు పెట్టారు. దర్శకుడు సాగర్ ఈ సినిమా కోసం సరికొత్త ప్రపంచాన్ని సృష్టించారు' అని చెప్పారు. జూన్ 14న సుధీర్‌బాబు మాస్ సంభవం చూడబోతున్నారని దర్శకుడు జ్ఞానసాగర్ ద్వారక చెప్పారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/4uAYVEx లో చదవండి.





దిక్సూచి
DIKSUCHI

ఎంటెక్



సిడాక్-ఈఆర్‌డీసీఐఐటీ

తిరువనంతపురంలోని సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సిడాక్)కు చెందిన ఈఆర్&డీసీఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఈఆర్‌డీసీఐఐటీ)- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ ప్రోగ్రామ్ ఇన్ ఇంజనీరింగ్(ఎంటెక్)లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా లైవ్ ప్రాజెక్ట్ వర్క్‌లు, సిడాక్ ఆర్ అండ్ డీ ల్యాబ్స్‌లో ఇంటర్న్‌షిప్ ఉంటాయి. గేట్ వ్యాలిడ్ స్కోర్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

స్పెషలైజేషన్‌లు-సీట్లు: ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగంలో వీఎల్ఎస్ఐ అండ్ ఎంబెడెడ్ సిస్టమ్స్, కంప్యూటర్ సైన్స్ విభాగంలో సైబర్ ఫోరెన్సిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ స్పెషలైజేషన్‌లు అందుబాటులో ఉన్నాయి. ఒక్కో స్పెషలైజేషన్‌లో 30 సీట్లు ఉన్నాయి.

అర్హత: వీఎల్ఎస్ఐ స్పెషలైజేషన్‌కు(బీఈ/బీటెక్)(ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/అప్లయిడ్ ఎలక్ట్రానిక్స్/అప్లయిడ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/ఇన్‌స్ట్రుమెంటేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ బయోమెడికల్/ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులై ఉండాలి. సైబర్ ఫోరెన్సిక్స్ స్పెషలైజేషన్‌కు(బీఈ/బీటెక్)(కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్) పూర్తిచేసి ఉండాలి. ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారికి ప్రథమ ప్రాధాన్యం ఉంటుంది. ఇంకా సీట్లు మిగిలిన పక్షంలో మాత్రమే నాన్ గేట్ అభ్యర్థులను పరిగణనలోకి తీసుకుంటారు. వీరికి డిగ్రీ స్థాయిలో ఆరో సెమిస్టర్ వరకు వచ్చిన మార్కుల ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

- **ఈ-మెయిల్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 30
- **దరఖాస్తు హార్డ్ కాపీ చేరేందుకు చివరి తేదీ:** జూలై 6
- **ఈ-మెయిల్:** erdciit@cdac.in
- **వెబ్‌సైట్:** http://erdciit.ac.in

మౌలానా ఆజాద్ వర్సిటీ

హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ(సెంట్రల్ యూనివర్సిటీ-మనూ)కి చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ- ఎంటెక్(కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్) పార్ట్ టైం ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఈ ప్రోగ్రామ్ స్పెషలైజేషన్ 'ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్'. మొత్తం 30 సీట్లు ఉన్నాయి.

అర్హత: పదోతరగతి/ఇంటర్/డిగ్రీ స్థాయిలో ఉర్దూ ఒక సబ్జెక్టుగా/సెకండ్ లాంగ్వేజ్‌గా లేదా ఉర్దూ మాధ్యమంలో చదివి ఉండాలి. లేదా మనూ గుర్తింపు పొందిన సంస్థ నుంచి ఉర్దూ మాధ్యమంలో మదర్సా కోర్సు పూర్తిచేసి ఉండాలి. లేదంటే సంస్థ అందించే ఎలిమెంటరీ ఉర్దూ కోర్సు(ఆడిట్ కోర్సు)ను పూర్తిచేయాల్సి ఉంటుంది. ఇందులో కనీసం 40 శాతం మార్కులు రావాలి.

- గుర్తింపు పొందిన కళాశాల నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో(బీఈ/బీటెక్)(కంప్యూటర్ సైన్స్/కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్/కంప్యూటర్ ఇంజనీరింగ్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్/ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ ఇంజనీరింగ్/ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్)/ఐఈటీఈ/ఏఎంఐఈ(ఈసీఈ/సీఎస్ఈ/ఐటీ/ఈఈ) ఉత్తీర్ణులై ఉండాలి. ఎమ్మెస్సీ(ఐటీ/ఎలక్ట్రానిక్స్/కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మాటిక్స్/ఇన్ఫర్మేషన్ సైన్స్ అండ్ టెక్నాలజీ/ఫిజిక్స్/మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్/ఆపరేషన్ రీసెర్చ్/అప్లయిడ్ ఫిజిక్స్)/ఎంసీఏ పూర్తిచేసిన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 30
- **ఆన్‌లైన్ సర్టిఫికెట్ వెరిఫికేషన్:** జూలై 15
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** ఆగస్టు 26 నుంచి
- **వెబ్‌సైట్:** https://manuu.edu.in

డా.వైఎస్సార్‌హెచ్‌యూలో డిప్లొమాలు

పశ్చిమగోదావరి జిల్లా-వెంకటరామన్నగూడెంలోని డా.వైఎస్సార్ హార్టికల్చరల్ యూనివర్సిటీ(డావైఎస్సార్‌హెచ్‌యూ)- డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా రాష్ట్రంలోని ప్రభుత్వ, అనుబంధ హార్టికల్చరల్ పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్స్ నిర్వహిస్తారు. డిప్లొమా ఇన్ హార్టికల్చర్ ప్రోగ్రామ్‌లో 528 సీట్లు, డిప్లొమా ఇన్ హార్టికల్చరల్ ఫుడ్ ప్రాసెసింగ్ ప్రోగ్రామ్‌లో 22 సీట్లు చొప్పున మొత్తం 550 సీట్లు ఉన్నాయి.

ప్రభుత్వ హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లు: డా.బీ.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా-రామచంద్రాపురంలోని ఎస్‌కేపీపీ హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లో 60 సీట్లు, ఏలూరు జిల్లా-నూజివీడులోని హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లో 40 సీట్లు, అన్నమయ్య జిల్లా-కలికిరిలోని హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లో 40 సీట్లు, శ్రీ సత్యసాయి జిల్లా-మడకశిరలోని ఎస్ఎస్‌పీజీ హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లో 60 సీట్లు చొప్పున మొత్తం 200 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు అదనంగా పది శాతం సీట్లు కేటాయించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో మొత్తం 220 సీట్లు ఉన్నాయి.

అనుబంధ హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లు: శ్రీకాకుళం జిల్లా-ఎస్వీ హార్టికల్చరల్ పాలిటెక్నిక్, మన్యం జిల్లా-ఎన్ఆర్ఆర్ హార్టికల్చరల్ పాలిటెక్నిక్, ఏలూరు జిల్లా-నోవా కాలేజ్ ఆఫ్ హార్టికల్చరల్ పాలిటెక్నిక్, పలనాడు జిల్లా-సాదినేని చౌదరయ్య హార్టికల్చరల్ పాలిటెక్నిక్, ప్రకాశం జిల్లా-శ్రీ బెల్లంకొండ హార్టికల్చరల్ పాలిటెక్నిక్, వైఎస్సార్ కడప జిల్లా-ఎస్‌బీవీఆర్ హార్టికల్చరల్ పాలిటెక్నిక్, నంద్యాల జిల్లా-ఎస్ఆర్ హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లలో ఒక్కోదానిలో 40 చొప్పున మొత్తం 280 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు అదనంగా 28 సీట్లు కేటాయించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అనుబంధ పాలిటెక్నిక్ కళాశాలల్లో మొత్తం 308 సీట్లు ఉన్నాయి.

డిప్లొమా ఇన్ హార్టికల్చరల్ ఫుడ్ ప్రాసెసింగ్ సీట్ల వివరాలు: నంద్యాల జిల్లాలోని హార్టికల్చరల్ ఫుడ్ ప్రాసెసింగ్ పాలిటెక్నిక్ కళాశాలలో 20 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు అదనంగా 2 సీట్లు కేటాయించారు. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 22 సీట్లు ఉన్నాయి.

- **దరఖాస్తు, కౌన్సెలింగ్ ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.800; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.400
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 18
- **వెబ్‌సైట్:** https://drysrhu.ap.gov.in

ఎయిర్ ఫోర్స్ కామన్ అడ్మిషన్ టెస్ట్

ఎయిర్ ఫోర్స్‌లో ఉన్నత ఉద్యోగాలకు ఉద్దేశించిన ఎయిర్ ఫోర్స్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఏఎఫ్‌క్యాట్-02/2024) నోటిఫికేషన్ విడుదలైంది. కోర్సు 2025 జూలైలో ప్రారంభం కానుంది.

1. **ఏఎఫ్‌క్యాట్ ఎంట్రీ:** ఫ్లయింగ్/గ్రౌండ్ డ్యూటీ (టెక్నికల్)/గ్రౌండ్ డ్యూటీ(నాన్ టెక్నికల్)
2. **ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ:** ఫ్లయింగ్

అర్హతలు: ఇంటర్(ఫిజిక్స్, మేథ్స్), సంబంధిత విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ/బీఈ, బీటెక్ ఉత్తీర్ణతతో నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.

ఎంపిక విధానం: పోస్టును అనుసరించి ఆన్‌లైన్ పరీక్ష, స్టేజ్-1, స్టేజ్-2 పరీక్షలు, ఇంటర్వ్యూ, కంప్యూటరైజ్డ్ పైలెట్ సెలెక్షన్ సిస్టం పరీక్ష, వైద్య పరీక్షలు, ధ్రువపత్రాల పరిశీలన తదితరాలను నిర్వహించి శిక్షణకు ఎంపిక చేస్తారు.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: జూన్ 28

ఆన్‌లైన్ పరీక్ష తేదీలు: 2024 ఆగస్టు 9, 10, 11

వెబ్‌సైట్: https://afcat.cdac.in/AFCAT/

యూపీఎస్సీ ఎన్‌డీఏ ఎగ్జామ్

నేషనల్ డిఫెన్స్ అకాడమీ అండ్ నేవల్ అకాడమీ(ఎన్‌డీఏ అండ్ ఎన్ఏ) నోటిఫికేషన్‌ను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) విడుదల చేసింది. త్రివిధ దళాల్లో 2025 జూన్ 2 నుంచి ప్రారంభం అయ్యే 154వ కోర్సులో, 116వ ఇండియన్ నేవల్ అకాడమీ(ఐఎన్ఏసీ) కోర్సులో ప్రవేశాలకు ఈ పరీక్షను ఉద్దేశించారు. అర్హులైన మహిళా, పురుష అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

- యూపీఎస్సీ - నేషనల్ డిఫెన్స్ అకాడమీ అండ్ నేవల్ అకాడమీ ఎగ్జామినేషన్(2)-2024

ఖాళీలు: మొత్తం 404. వీటిలో నేషనల్ డిఫెన్స్ అకాడమీ పోస్టులు 370(ఆర్మీ-208, నేవీ-42, ఎయిర్‌ఫోర్స్-120) ఉన్నాయి. వాటిలో 28 గ్రౌండ్ డ్యూటీకి సంబంధించిన ఖాళీలు. నేవల్ అకాడమీ(10+2 క్యాడెట్ ఎంట్రీ స్కీమ్) ఖాళీలు 34 ఉన్నాయి.

అర్హత: ఆర్మీ వింగ్ పోస్టులకు దరఖాస్తు చేసుకునే వారు ఏదైనా గ్రూపుతో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. ఎయిర్ ఫోర్స్, నేవీ పోస్టులకు 10+2 క్యాడెట్ ఎంట్రీ స్కీమ్(ఇండియన్ నేవల్ అకాడమీ) ద్వారా దరఖాస్తు చేసుకునే వారు ఫిజిక్స్, మేథ్స్ సబ్జెక్టులతో ఇంటర్ లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. దీంతోపాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు ఉండాలి. ప్రస్తుతం ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.



వయసు: అవివాహిత పురుష, మహిళా అభ్యర్థులు 2006 జనవరి 1కి ముందు, 2009 జనవరి 1 తరవాత జన్మించి ఉండకూడదు.

దరఖాస్తు: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

ఎంపిక విధానం: అభ్యర్థులను రెండు దశల్లో ఎంపిక చేస్తారు. రాత పరీక్ష, ఇంటెలిజెన్స్-పర్సనాలిటీ టెస్ట్, ఎస్ఎస్‌బీ టెస్ట్/ఇంటర్వ్యూ, మెడికల్ టెస్ట్ తదితరాల ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.

కోర్సులు: నేషనల్ డిఫెన్స్ అకాడమీ అండ్ నేవల్ అకాడమీ(ఎన్‌డీఏ అండ్ ఎన్ఏ), ఆర్మీ 10+2 బీటెక్ క్యాడెట్ ఎంట్రీ పరీక్షలో మెరిట్ సాధిస్తే డిగ్రీ కోర్సులకు ఎంపికవుతారు. అలా ఎంపికైనవారు బీఏ, బీఎస్సీ, బీటెక్ కోర్సుల్లో తాము ఎంచుకున్న దాన్ని ఉచితంగా చదవవచ్చు.

దరఖాస్తు రుసుము: రూ.100. ఎస్సీ, ఎస్టీ, మహిళా అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూన్ 4

ఆన్‌లైన్ పరీక్ష తేదీ: సెప్టెంబరు 1

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: అనంతపురం, హైదరాబాద్, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, వరంగల్.

వెబ్‌సైట్: https://upsc.gov.in/

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/gliKhrpలో చదవండి.



తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

సూపర్‌స్టార్ కృష్ణ జయంతిని పురస్కరించుకుని
బుర్రిపాలెంలో హెల్త్‌క్యాంపు


చిన్నారికి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

తెనాలి రూరల్, మే 31: సూపర్ స్టార్ కృష్ణ స్వగ్రామమైన బుర్రిపాలెంలో ఆయన జయంతిని పురస్కరించుకుని హెల్త్ క్యాంపు నిర్వహించారు. కృష్ణ కుమారుడు సినీహీరో ప్రిన్స్ మహేష్‌బాబు ఆధ్వర్యంతో ఆయన దత్తత గ్రామమైన బుర్రిపాలెంలో విజయవాడ ఆంధ్ర హాస్పటల్స్ సౌజన్యంతో ఉచిత మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపులో పిల్లల వైద్యులు, గైనకాలజి, గుండె, చెవి,ముక్కు, తదితర వైద్యనిపుణులు పాల్గొని గ్రామస్థులకు పరీక్షలు నిర్వహించారు. క్యాంపునకు దాదాపుగా 118 మంది హాజరయ్యారని అవసరమైన వారికి మందులు ఉచితంగా అందించడం జరిగిందని ఆంధ్ర హాస్పటల్ డైరెక్టర్, పిల్లల వైద్యనిపుణులు పీవీ రామారావు తెలిపారు. వైద్యులు డాక్టర్ ముదస్సిర్, డాక్టర్ సుజని, డాక్టర్ సాయికిషోర్, డాక్టర్ అమర్, డాక్టర్ పవన్, డాక్టర్ రమేష్, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.


ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న మానస

కాపురానికి రాలేదని భార్యపై కత్తితో దాడి

తెనాలి క్రైం, మే 31: గత కొంత కాలంగా భార్య కాపురానికి రాకపోవడంతో అనుమానాలు పెంచుకున్న భర్త ఆమెపై కత్తితో తీవ్రంగా గాయపరచిన సంఘటన స్థానిక కొత్తపేటలో శుక్రవారం జరిగింది. ఒన్‌టౌన్ సీఐ దశరధరామారావు తెలిపిన వివరాల మేరకు కొల్లూరుకు చెందిన చిల్లా రవి (31)కి చుండూరు మండలం వలివేరుకు చెందిన అక్క కూతురు మానసతో (26)ఏడు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. మనస్పర్ధ కారణంగా కొంతకాలంగా వీరు వేరువేరుగా ఉంటున్నారు. భర్త రవి కొల్లూరులో కూలి పనులు చేసుకుంటుండగా భార్య మానస వలివేరులోని తల్లి ఇంటి నుంచి రోజు తెనాలి వచ్చి స్థానిక న్యాయవాది వద్ద డీటీపీ ఆపరేటర్‌గా పనిచేస్తోంది. వీరికి పిల్లలు లేరు. వీరి మధ్య మనస్పర్ధలతో గత ఏడాది ఒన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో 498(ఎ) కేసు నమోదైంది. తిరిగి పెద్దలు వీరి మధ్య సఖ్యత కుదిర్చినా వివాదాలు సద్దుమణగలేదు. తిరిగి వేరు వేరుగానే జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం 4గంటల సమయంలో భర్త చిల్లా రవి మానస పనిచేస్తున్న ఆఫీసు వద్దకు వచ్చి నేను ఫోన్‌చేస్తే తీయడం లేదంటూ వివాదానికి దిగాడు. తనవెంట తెచ్చుకున్న కత్తితో ఆమెపై తీవ్రంగా గాయపరిచాడు. స్థానికులు ఆమెను తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆమె పరిస్థితి ఆందోళనగా ఉండటంతో అక్కడి నుంచి మెరుగైన చికిత్సకోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. దీనిపై ఒన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి భర్త చిల్లా రవిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు.

సాహిత్య సమ్మేళనంలో పాల్గొన్న తెనాలి వాసి


సాహిత్య సమ్మేళనంలో పాల్గొన్న హకీంజాని

తెనాలి అర్బన్, మే 31: హైదరాబాద్‌లో నిర్వహించిన బాల సాహిత్య సమ్మేళనంలో తెనాలికి చెందిన సాహిత్యవేత్త అబ్దుల్ హకీంజాని పాల్గొనే అవకాశం దక్కింది. అబిడ్స్‌లో 29, 30 తేదీలలో తెలంగాణ సరస్వత పరిషత్ ఆధ్వర్యంలో సమ్మేళనం నిర్వహించారు. హకీంజాని బాల సాహిత్యంలో చేసిన రచనలను గుర్తించి పాల్గొనే అవకాశం కల్పించారు. ఆయన సాహిత్యసేవను తెలంగాణ ప్రభుత్వ మోడల్ స్కూల్స్ సంచాలకులు పాలడుగు సరోజిని, పరిషత్ అధ్యక్షుడు శివారెడ్డి, కార్యదర్శి చెన్నయ్య తదితరులు అభినందించారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

● టు టౌన్ సీఐ సుధాకర్


బీసీ కాలనీలో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

తెనాలి అర్బన్, మే 31: కౌంటింగ్ సందర్భంగా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని టూ టౌన్ సీఐ సుధాకర్ పేర్కొన్నారు. స్టేషన్ పరిధిలోని బీసీ కాలనీ తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. పలు అపార్ట్‌మెంట్‌లు, గృహాలలో కార్డెన్‌సెర్చ్ జరిపి అనుమతులు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఆయా ప్రాంతాల్లోని కూడళ్లలో ప్రజలకు కౌంటింగ్ నిబంధనలు వివరించారు. ఈ నెల 4న జరిగే కౌంటింగ్ దృష్టిలో ఉంచుకుని ఎక్కడా ఎలాంటి గొడవలు, ఘర్షణలు లేకుండా పోలీసు యంత్రాంగం నిరంతర పర్యవేక్షణ చేస్తుందన్నారు.


చెముడుబాడులో 18 వాహనాలను సీజ్ చేసిన పోలీసులు

రాజకీయ దాడులకు పాల్పడితే కఠిన చర్యలు

● సీఐ వెంకటేశ్వర్లు

కొల్లిపర, మే 31: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో రాజకీయ దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోనున్నట్లు తెనాలి రూరల్ సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని చెముడుబాడు, చెముడుబాడుపాలెం గ్రామాల్లో సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు డీఎస్పీ రమేష్ పర్యవేక్షణలో ఎటువంటి అల్లర్లు జరుగకుండా ముందు జాగ్రత్త చర్యగా 50మంది పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో రెండు గ్రామాల్లో సరైన పత్రాలు లేకపోవడంతో 18 ద్విచక్రవాహనాలను పోలీసులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎలక్షన్ కోడ్ అమల్లో ఉన్నందున ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలన్నారు. కౌంటింగ్ సందర్భంగా ఎటువంటి గొడవలు సృష్టించినా వారిపై కేసులు బనాయించనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో సీఐ సుధాకర్, ఎస్ఐలు రవీంద్రరెడ్డి, డేవిడ్, బాబురావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ

తెనాలి, మారీసుపేట మే 31: స్థానిక బోసురోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద అన్నదాత సుఖీభవ తెనాలి వారి ఆధ్వర్యంలో చలివేంద్రంలో చల్లని మజ్జిగ పంపిణీ చేశారు. శుక్రవారం సినీ నటుడు సూపర్‌స్టార్ ఘట్టమనేని కృష్ణ జయంతి సందర్భంగా ఈదర పూర్ణచంద్, కృష్ణ అభిమానుల సహకారంతో చల్లని మజ్జిగను పాదచారులకు, ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొత్తగోళ్ళ శ్రీనివాసరావు, సందీప్, మురళి, కుర్రా శ్రీనివాసరావు, కృష్ణ అభిమాన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి

కొల్లిపర, మే 31: అనారోగ్యం కారణంగా గుర్తు తెలియని వ్యక్తి తెనాలి ప్రభుత్వ వైద్యశాలలో మృతి చెందినట్లు ఎస్ఐ రవీంద్రరెడ్డి శుక్రవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ప్రకారం గుర్తు తెలియని వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతుండటంతో అతనిని కొల్లిపర సామాజిక ఆరోగ్య కేంద్రానికి గురువారం తీసుకెళ్లారు. మెరుగైన చికిత్స కోసం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు 108 ద్వారా తరలించారు. దీంతో అతను శుక్రవారం మృతి చెందినట్లు తెలిపారు. ఇతని వివరాలు తెలిసిన వారు కొల్లిపర పోలీసుస్టేషన్‌లో తెలియజేయాలన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

● టీడీపీ కౌన్సిలర్ల డిమాండ్

● నీటి సరఫరా లేకుండా పన్నులపై నిలదీత


కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ రాధిక, తాగునీటి పన్నుపై అధికారులను నిలదీస్తున్న టీడీపీ కౌన్సిలర్ పిన్నారావు, కౌన్సిలర్ త్రిమూర్తి

తెనాలి, మారీసుపేట ఏప్రిల్ 30: పట్టణంలోని కొన్ని వార్డులలో తాగునీటి సరఫరా సక్రమంగా నిర్వహించటంలేదని, సరఫరా లేని నీటి కనెక్షన్లకు నీటి పన్నులు కట్టాలని డిమాండ్ నోటీసులు ఇస్తున్నారని, ముందు తాగునీటి సమస్యను పరిష్కరించాలని అధికారపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. తెనాలి కౌన్సిల్ సాధారణ సమావేశం శుక్రవారంవారం చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన జరిగాయి. ఉదయం గం.11.30 లకు సాధారణ సమావేశం మొదలయితే, అజెండాలోని రెండు అంశాలు చర్చించిన తరువాత మూడో అంశం చదువుతుండగా 20వ వార్డు టీడీపీ కౌన్సిలర్ దేసు యుగంధర్ మాట్లాడుతూ మరికొద్ది రోజులలో రాష్ట్రంలో రుతుపవనాలు రానున్నాయని, చలివేంద్రాలకు కేటాయించిన అంచనాలను సవరించాలన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక సమాధానం చెప్పమని అధికారులను కోరగా మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు చలివేంద్రంను నిర్వహించినంత కాలానికే కాంట్రాక్టర్‌కి చెల్లించడం జరుగుతుందని తెలిపారు. ఇదే సందర్భంలో 17వ వార్డు టీడీపీ కౌన్సిలర్ అన్నం పిన్నారావు మాట్లాడుతూ తన వార్డులో తాగునీరు ఇవ్వని గృహాలకు కూడా నీటి పన్నును విధించడం దోపిడీ అన్నారు. 25వ వార్డు వైసీపీ కౌన్సిలర్ తాడిబోయిన రామయ్య కలగజేసుకొని కౌన్సిలర్ పిన్నారావు అన్న దోపిడీ అనే మాటను వెనకకు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టీడీపీ కౌన్సిలర్ త్రిమూర్తి మాట్లాడుతూ తన అన్నమాటలో కౌన్సిల్‌ని కించపర్చలేదని, కావాలంటే డిమాండ్ నోటీసును చూడాలని చైర్‌పర్సన్ కోరారు. పలువురు వైసీపీ సభ్యులు వాదనకు దిగడంతో సభలో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. చైర్‌పర్సన్ సమాధానమివ్వాలంటూ ప్రతిపక్ష సభ్యులు చైర్‌పర్సన్‌ని నిలదీశారు. కమీషనర్ బి శేషన్న సమాధానమిస్తు ఇంటిపన్ను డిమాండ్ నోటీసులో నీటిపన్నును కలిపి ఇచ్చిన మాట వాస్తవమేనని, ఇదే విషయపై ఫిబ్రవరిలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో సభ్యులతో కలసి ఒక కమిటీని ఏర్పాటు చేశామని తెలిపారు.

ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున జూన్ 6వ తేదీ తరువాత చర్చించి నిర్ణయం తీసుకుందామని తెలిపారు. అనంతరం ఎజెండాలోని నాలుగు అంశాలను ఆమెదించినట్లు చైర్‌పర్సన్ రాధిక ప్రకటించారు. కార్యక్రమంలో అధికార, విపక్ష కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ఒక్కో రైతుకు ఐదు పత్తి విత్తనాల ప్యాకెట్లు

● జిల్లా రైతులకే పంపిణీ

● విత్తన కొరత నివారణకు వ్యవసాయ శాఖ చర్యలు


రైతుల పాసు పుస్తకాలు పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

గుంటూరు సిటీ, మే 31: విత్తన కొరత నివారణకు గుంటూరు జిల్లా వ్యవసాయ శాఖ చర్యలు చేపట్టింది. శుక్రవారం ఉదయం నుంచి నగరంలోని విత్తనాల దుకాణాల్లో వ్యవసాయ శాఖ అధికారులు మకాంవేసి అమ్మకాలు చేపట్టారు. విత్తనాల కోసం వచ్చిన రైతుల పాసు పుస్తకాలు పరిశీలించి వారు ఈ జిల్లాకు చెందిన వారే అని నిర్ధారించిన తర్వాత అమ్మకాలు జరుపుతున్నారు. ప్రస్తుతం కేవలం గుంటూరు జిల్లాకు చెందిన రైతులకు మాత్రమే పత్తి విత్తనాలు అమ్ముతున్నట్లు అధికారులు వెల్లడించారు. ఒక్కో రైతుకు సాగు విస్తీర్ణం ఆధారంగా గరిష్టంగా 5 ప్యాకెట్లను అందజేస్తున్నారు. నగరంలోని రాజా గారి తోట, ఏటుకూరు రోడ్డులో ఉన్న విత్తనాల దుకాణాల్లో జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏవోలు అమ్మకాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డీఏవో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రెండు కంపెనీలకు చెందిన విత్తనాలకు మాత్రమే కొంత కొరతఉందని, మిగిలిన కంపెనీలకు చెందిన విత్తనాల నిల్వలు పుష్కలంగా ఉన్నాయని చెప్పారు. నూజివీడు సీడ్స్‌కు చెందిన సూపర్ బంటీ విత్తనాలు గురువారం 1530 ప్యాకెట్లు అర్బన్ పరిధిలోని దుకాణాలకు వచ్చాయని అన్నారు. స్టాక్ వచ్చిన వెంటనే స్టాప్ సేల్ ఆదేశాలు ఇచ్చామన్నారు. వాటిని వ్యవసాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో శుక్రవారం విక్రయాలు జరిపేలా చర్యలు చేపట్టామన్నారు. వ్యాపారులు విత్తనాలు బ్లాక్ చేస్తే ఊరుకునేది లేదని ఆయన స్పష్టం చేశారు. విత్తనాలు అధిక ధరలకు విక్రయించినా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇక మీదట జిల్లాకు వచ్చిన విత్తనాలు కూడా ఇదే రీతిలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలోనే అమ్మకాలు జరుపుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ సునీల్, ఏవోలు భవనం అంజిరెడ్డి, బి.కిషోర్, విస్తరణ అధికారులు ఆర్‌వీ శివాజీ, వి.ఆనంద్ పాల్గొన్నారు.

హనుమత్ జయంతి ఉత్సవాలు ప్రారంభం


పది లక్షల ప్రదక్షిణల యజ్ఞంలో పాల్గొన్న భక్తులు, శ్రీచిట్టి ఆంజనేయస్వామి మూలవిరాట్, శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

పొన్నూరు టౌన్, మే 31: పొన్నూరు పట్టణంలోని వీరాంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం హనుమత్ జయంతి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమైయ్యాయి. వేకువజామున ప్రత్యేక పూజల అనంతరం స్వామివారి భారీ ఏక శిలా విగ్రహానికి అర్చక స్వాములు పంచామృత అభిషేకాలను నిర్వహించారు. వివిధరకాల సుగంధ ద్రవ్యాలు, పసుపు కుంకుమ, చందనం జలాలతో స్వామి వారిని అభిషేకించారు. మధ్యాహ్నం లక్ష తమలపాకుల పూజ జరిగింది. సాయంత్రం సువర్చలా సమేత వీరాంజనేయస్వామి ఉత్సవమూర్తులను ఉష్ట్ర వాహనంపై ఉంచి పురవీదులో ఊరేగించారు. హనుమత్ జయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు పొన్నూరు పరిసర ప్రాంతాల నుంచే కాకుండా జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అలాగే తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాలకు చెందిన ఆంజనేయ స్వామి దీక్షాపరులు వీరాంజనేయ స్వామిని దర్శించుకుని ఇరుముడులు చెల్లించి దీక్షలు విరమించారు. అలాగే పొన్నూరు పట్టణంలోని మరో ప్రసిద్ధి క్షేత్రం సాక్షి భావనారాయణస్వామి ఆలయ ప్రాంగణంలోని పురాతన ఆలయం దాసాంజనేయస్వామి ఆలయంలోనూ హనుమత్ జయంతి వేడుకలు ప్రారంభమైయ్యాయి. పాతపొన్నూరు వీరాంజనేయ స్వామి ఆలయం, చింతలపూడి దాసాంజనేయ స్వామి ఆలయం, మండల పరిధిలోని నండూరు హనుమత్ పీఠం ప్రపతాంజనేయ స్వామి ఆలయంలో హనుమత్ జయంతి వేడుకలు జరిగాయి. పీఠం నిర్వాహకులు వల్లూరు శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామికి తమలపాకుల పూజ జరిపారు. ములుకుదురు లో హనుమత్ జయంతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. శనివారం పట్టణంలోని వీరాంజనేయ స్వామి ఆలయంలో స్వామి కల్యాణానికి ప్రత్యేక ఏర్పాట్లను చేశారు.


స్వామికి పంచామృత అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చక స్వాములు


సాలిగ్రామ మఠంలో దాసాంజనేయ స్వామివారికి పూజలను నిర్వహిస్తున్న బాలస్వామిజీ

నేటి నుంచి చిట్టి ఆంజనేయస్వామి శత జయంతి

తెనాలి అర్బన్, మే 31 : పట్టణంలోని పలు ఆలయాలలో హనుమత్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మారీసుపేటలోని శివాలయ ఆవరణలో ఉన్న వీరాంజనేయస్వామి ఆలయంలో పది లక్షల ప్రదక్షిణల మహా యజ్ఞంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్వామివారిని నిమ్మ ఫలాలతో అర్చన చేశారు. లలితాగోష్ఠి బృందం హనుమాన్ చాలీసా పఠించారు. గాంధీచౌక్‌లోని గోవర్ధన స్వామి ఆలయంలో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. షరాఫ్ బజారులోని శ్రీసువర్చలా సమేత పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమత్ జయంతి ఉత్సవాలు పురస్కరించుకుని శుక్రవారం శోభాయాత్ర నిర్వహించారు. జూన్ 1 నుంచి 11 వరకు ఈ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ప్రతి రోజూ 108సార్లు హనుమాన్ చాలీసా పారాయణ చేసి లక్ష హనుమాన్ చాలీసాయజ్ఞం పూర్తి చేస్తారు. శోభాయాత్రలో ఎస్‌బీ శివ, ఈవో శ్రీనివాస రెడ్డి, అనురాధ, వెంకటేశ్వరరావు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. బోసురోడ్డులోని శ్రీచిట్టి ఆంజనేయ స్వామి ఆలయంలో నిర్మించి నూరేళ్లు కావడంతో శత జయంతి ఉత్సవాలు శనివారం నుంచి మూడు రోజుల పాటు జరుగుతాయి. ఆలయాన్ని రంగులతో తీర్చిదిద్ది వేడుకలకు సిద్ధంచేశారు. మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఏర్పాటుచేశారు. అర్చకులు దివి చక్రవర్తి, వేణుమాధవ్, కమిటీ సభ్యులు పర్యవేక్షిస్తున్నారు.

గంగానమ్మపేటలోని శ్రీవిద్యాపీఠంలో...

తెనాలి, మారీసుపేట మే 31: స్థానిక గంగానమ్మపేటలోని శ్రీవిద్యాపీఠంలో శ్రీసాలిగ్రామ మఠం ట్రస్ట్ వారు దాసాంజనేయస్వామి వారి వార్షిక, హనుమత్ జయంతి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం రెండోరోజు దాసాంజనేయస్వామి వారికి సుప్రభాత సేవ, పంచామృతాలతో అభిషేకాలను నిర్వహించి, 1108 అరటి పండ్లతో కదిలిఫలార్చనను నిర్వహించారు. శ్రీరామలింగేశ్వర భజన మండలి తెనాలి వారు భక్తులచే రామ సంకీర్తనలు, హనుమాన్ చాలీసా పారాయణ చేయించారు. స్వామి వారికి వివిధ రకముల సుగంధ ద్రవ్యములచే అభిషేకాలను, పూజలను నిర్వహించారు. బాలస్వామిజీ భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ నంబూరి కృష్ణమూర్తి, జాయింట్ సెక్రటరీ ముద్దాభక్తుని రమణయ్య, పెనుగొండ వెంకటేశ్వరావు, గుడివాడ శివప్రసాద్, కోన నాగేశ్వరావు, గోపు రామకృష్ణ, ఎం కాశీవిశ్వనాధం కారుణాకర్, శ్రీజయలక్ష్మి మాతృమండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సంపాదనను పేదల కోసం వెచ్చించటం గొప్ప విషయం

● పెమ్మసాని పోతురాజు


హోమ్‌లో ఆశ్రయం పొందుతున్న వారికి పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న పెమ్మసాని పోతురాజు, మురళి, నాగభూషణం

తెనాలి రూరల్, మే 31: డబ్బులు ఏదో రూపేణా అందరూ సంపాదిస్తారు.. కాని అందులో కొంత పేదల కోసం ఖర్చుపెట్టే మనస్సు అందరికీ ఉండదు. అటువంటిది గణేష్‌యూత్ కన్వీనర్, టీడీపీ నాయకులు వీరవల్లి మురళి తన సంపాదనలో తొలి ప్రాధాన్యతగా పేదలకోసం ఖర్చుచేయడం గొప్పవిషయమని కూటమి ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ బాబాయి పెమ్మసాని పోతురాజు అన్నారు. శుక్రవారం మండలంలోని అంగలకుదురులో గణేష్‌యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి ఆధ్వర్యంలో పెమ్మసాని చంద్రశేఖర్ ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో మంచి నాయకుడిగా మరెన్నో పదవులు చేపట్టి వాటికి వన్నెతేవాలని కోరుతూ జేఎంజే స్వధార్ హోమ్‌లో ఆశ్రయం పొందుతున్న వారికి పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పెమ్మసాని పోతురాజు మాట్లాడుతూ వీరవల్లి మురళి గణేష్‌యూత్ స్థాపించి ఎటువంటి స్వలాభం ఆశించకుండా అనేకమంది పేదలకు తన వంతుసాయమందించి పేరుపొందారని కొనియాడారు. పెమ్మసాని చంద్రశేఖర్‌పై మురళి, ఆయన మిత్రబృందం చూపుతున్న అభిమానానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మురళి మాట్లాడుతూ పెమ్మసాని లెజెండరీ నాయకుడన్నారు. అతిసామాన్యమైన కుటుంబంలో పుట్టి అసాధారణ వ్యక్తిగా ఎదిగి నేటి యువతరానికి ఆదర్శంగా నిలిచారన్నారు. పెమ్మసాని ప్రజలకు సేవ చేయాలన్న ఆశయంతో రాజకీయాల్లోకి వచ్చారో అదే ఆశయం నెరవేర్చేందుకు గణేష్‌యూత్ తన వంతు సహాయ సహకారాలు అందిస్తుందని మురళి స్పష్టం చేశారు. అంగలకుదురు ఉపసర్పంచ్ కనగాల నాగభూషణం పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో బొద్దులూరి వేణు, గొళ్ళపూడి సాయిగిరి, ఎల్ఎమ్ఎల్ ఖాదర్, విష్ణు, ఉన్నవ మురళి, ఆలపాటి వెంకట్రామయ్య, లక్ష్మయ్యచౌదరి, ఎన్ సదాశివరావు, బాబునాయక్, శ్రీనివాస్, నాగేశ్వరావు, చిట్టి తదితరులు పాల్గొన్నారు.


ఎన్‌సీసీ క్యాడెట్లతో మాట్లాడుతున్న లెఫ్టినెంట్ కల్నల్ ఎస్‌వీఎస్ సుదర్శన్

వీవీఐటీలో ముగిసిన ఎన్‌సీసీ వార్షిక శిబిరం

గుంటూరు (తూర్పు), మే 31: వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో గత పదిరోజులుగా నిర్వహిస్తున్న 10ఏ బెటాలియన్ బాలికల వార్షిక శిక్షణ శిబిరం శుక్రవారంతో ఘనంగా ముగిశాయి. శిబిరంలో క్యాడెట్లుకు వ్యాయామం, పరుగు, యోగా, కవాతు ఆయుధాలపై అవగాహన, ఫైర్ ఫైటింగ్, సీపీఆర్, మ్యాప్ రీడింగ్, త్రివిధ దళాలకు సంబంధించిన అంశాలపై శిక్షణ అందించారు. ముగింపు శిబిరానికి బెటాలియన్ కమాండింగ్ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ ఎస్‌వీఎస్ సుదర్శన్ హాజరై ఎన్‌సీసీ క్యాడెట్లుతో మాట్లాడారు. శిబిరంలో పాల్గొని దేశభక్తి, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకున్నారని, తొలిసారిగా ఏర్పాటు చేసిన సాహస విన్యాస పోటీలలో విద్యార్థులు ప్రదర్శించిన స్ఫూర్తి ప్రశంసనీయమని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా రోప్ వే, కొండలు ఎక్కడం వంటి సాహసకృత్యాలతోపాటు వాలీబాల్, ఖోఖో వంటి ఆటలలో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఎన్‌సీసీ క్యాడెట్లు నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమాలు, దేశభక్తి గీతాలను ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ శిక్షణ శిబిరంలో నిర్వహించిన పోటీలలో 25 మంది వీవీఐటీ విద్యార్థులు ప్రతిభ కనబరిచి పురస్కారాలు అందుకున్నారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి మేజర్ అనివాష్ పట్వాల్, వీవీఐ టీఎన్‌సీసీ అధికారి డాక్టర్ ఏ శ్రీవాణి, సిబ్బంది పాల్గొన్నారు.


సీఐటీయూ పతాకాన్ని ఎగురవేస్తున్న కార్మికులు

కార్మికుల హక్కుల పరిరక్షణకు సీఐటీయూ పోరాటం

పొన్నూరు టౌన్, మే 31: కార్మికుల హక్కుల పరిరక్షణకు సీఐటీయూ నిరంతరం పోరాడుతుందని ఆ సంస్థ మండల కార్యదర్శి నిమ్మకూరి రమేష్‌బాబు అన్నారు. సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ 55వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. సీఐటీయూ కార్యాలయం వద్ద పతాకాన్ని ఎగురవేసి వందన సమర్పణ చేశారు. రమేష్‌బాబు మాట్లాడుతూ కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తుంగలోకి తొక్కిందని ఆరోపించారు. నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి కార్మికుల గొంతు నొక్కే కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. మోడీ తెచ్చిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లకు రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీల ఎంపీలు సంపూర్ణ మద్దతు తెలియజేయటం సిగ్గుచేటు అని ఆరోపించారు. నల్ల చట్టాలను ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ అనుబంధ సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్ పెమ్మసాని జన్మదిన వేడుకలు


కేక్‌ను కట్ చేస్తున్న మాజీఎంపీపీ వెంకట్రావు, టీడీపీ నాయకులు వెంకటేశ్వరావు, తదితరులు

తెనాలి, మారీసుపేట మే 31: మండల పరిధిలోని అంగలకుదురులో గ్రామ టీడీపీ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల ఉమ్మడి పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ జన్మదిన వేడుకలను మాజీ ఎంపీపీ సూర్యదేవర సాంబశివరావు, టీడీపీ నాయకులు కరణం వెంకటేశ్వరావుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భగా వారు మాట్లాడుతూ విద్యావంతుడు, నిగర్వి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పుట్టిన గడ్డకు, ప్రజలకు సేవ చేయాడానికి స్వదేశానికి వచ్చారన్నారు. గుంటూరు పార్లమెంటు ఉమ్మడి కూటమి అభ్యర్థిగా పోటీ చేశారని, అఖండ విజయం సాధిస్తారని తెలిపారు. వారు ఇటువంటి జన్మదినోత్సవాలు ఎన్నో జరుపుకోవాలని అన్నారు. ముందుగా పెమ్మసాని జన్మదిన కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో చెన్నుపాటి లక్ష్మీనారాయణ, సిద్ధయ్య, ప్రసాదరావు, మోసు, అలపర్తి శివరామ్, ఎ.శ్రీకృష్ణ, వార్డు మెంబరు షేక్ సుభాని, తిరుమలరావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


అవగాహన ర్యాలీలో సిబార్ దంత వైద్యశాల డీన్ ఎల్.కృష్ణ ప్రసాద్, విద్యార్థులు

పొగాకు వ్యతిరేక అవగాహన ర్యాలీ

గుంటూరు (తూర్పు), మే 31: ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం సిబార్ దంత వైద్య కళాశాల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తొలుత అధ్యాపకులు, విద్యార్థులు కళాశాల డీన్ డాక్టర్ లింగమనేని కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో పొగాకు నిర్మూలన అవగాహన గోడపత్రికలను ఆవిష్కరించి జిల్లా వైద్యాధికారి వినతిపత్రం అందించారు. అనంతరం జిల్లా వైద్యాధికారి డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ పొగాకు రహిత సమాజానికి కృషి చేస్తున్న సిబార్ దంత వైద్య కళాశాలను అభినందించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇచ్చిన నినాదం గుర్తుచేస్తూ పిల్లలు పొగాకు బారిన పడకుండా చూడటం మన అందరి బాధ్యత అన్నారు. అనంతరం డీఎంహెచ్‌వో కార్యాలయంలో సిబార్ దంత కళాశాల వైద్యులు డాక్టర్ పి.శ్రీనివాస్, కిరణ్ కుమార్, లలిత్ ప్రకాష్ చంద్ర, ఆషాతోపాటు అంగన్వాడీ కార్యకర్తలకు పొగాకు వల్ల నోటి వ్యాధులపై అవగాహనా సదస్సు నిర్వహించారు.

ఆర్టీసీ బస్సు, పొక్లెయినర్ ఢీ.. ఒకరికి స్వల్ప గాయాలు


ప్రమాదంలో ధ్వంసమైన బస్సు సగభాగం

తెనాలి రూరల్, మే 31: ఆర్టీసీ బస్సు. క్రేన్ ఢీకొన్న ఘటన పట్టణంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఆ సమయంలో బస్సులో ప్రయాణికులు డ్రైవర్ కండక్టర్ కాక ఇద్దరే ఉండటంతో పెద్దప్రమాదం తప్పింది. త్రీటౌన్ పోలీసులు కథనం ప్రకారం గుంటూరు నుంచి తెనాలి వస్తున్న ఆర్టీసీ బస్సు బాలాజీరావుపేట ప్రధాన రోడ్డు మార్గంపై బస్‌స్టాండ్‌కు వెళ్లేందుకు వస్తుంది. అదే క్రమంలో బాలాజీ రావుపేట సినిమా థియేటర్ రోడ్డునుంచి ప్రధాన రోడ్డుకు చేరేందుకు వస్తున్న క్రేన్ ఆర్టీసీ బస్సును ఢీ కొట్టింది. ఈ క్రమంలో బస్సు ముందు సగభాగం పాక్షికంగా ధ్వంసం కాగా ఒక ప్రయాణీకుడికి స్వల్పగాయాలయ్యాయి. ఇదే ఘటనలో అదే మార్గంలో వెళుతున్న ద్విచక్రవాహనదారుడు హనీఫ్‌కు గాయాలు కావడంతో ఇద్దరిని తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించి వైద్యచికిత్స అందించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

కొల్లిపర సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ నిలిపివేత

కొల్లిపర, మే 31: కొల్లిపర సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు సబ్ ఇంజనీర్ సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం స్థానిక సబ్‌స్టేషన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొల్లిపర సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్‌ను నిలిపి వేస్తున్నట్లు తెలియజేశారు.